ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

శుక్రవారం 17 అక్టోబరు 2025 | 5





రాజాధిరాజ అలంకరణలో శ్రీవారు



'తెలుగు' వెలుగు



- బొమ్మూరులో ఎట్టకేలకు పూర్తిస్థాయి తెలుగు విశ్వవిద్యాలయం
- ఇన్‌చార్జి వీసీగా ఆచార్య డి.మునిరత్నంనాయుడు
- వర్సిటీ అభివృద్ధికి నిధుల విడుదలకూ ప్రతిపాదనలు
- 1986 ఏప్రిల్‌లో తెలుగు సాహిత్య పీఠానికి ఎన్టీఆర్ శంకుస్థాపన
- రాష్ట్ర విభజన తర్వాత ఇన్నాళ్లకు విశ్వవిద్యాలయం ఏర్పాటు
- తెలుగుభాషకు, సాహిత్యానికి ఇక పూర్వవైభవం



మునిరత్నంనాయుడు



బొమ్మూరులోని విశ్వవిద్యాలయ పీఠం

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

ఇది ఎన్నో ఏళ్ల నాటి కల... ఇన్నాళ్లకు కార్యరూపం దాల్చింది. రాజమహేంద్రవరంలో తెలుగు విశ్వవిద్యాలయం పూర్తిస్థాయిలో రూపుదిద్దుకోబోతోంది. ఇప్పటివరకు బొమ్మూరులో తెలుగు విశ్వవిద్యాలయ పీఠం ఉంది. రాష్ట్ర విభజన తర్వాత ఇది పూర్తిస్థాయి యూనివర్సిటీగా మారుతుందని అందరూ ఆశించారు. అందుకు కొన్ని ప్రయత్నాలు జరిగాయి. గత ప్రభుత్వ హయాంలో దీన్ని పట్టించుకున్నది లేదు. ఎట్టకేలకు గత జూన్ నెలలో ఈ పీఠాన్ని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంగా రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపి నోటిఫికేషన్ ఇచ్చింది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఈ యూనివర్సిటీకి ఇన్‌చార్జి వీసీగా ప్రాచీన తెలుగు కేంద్రం మాజీ ప్రాజెక్టు డైరెక్టర్ డి.మునిరత్నంనాయుడుని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఈ విశ్వవిద్యాలయంలో కదలిక వచ్చినట్టయింది. ఆయన బాధ్యతలు తీసుకున్న తర్వాత రిజిస్ట్రార్‌ను నియమిస్తారు. తర్వాత తెలుగు విశ్వవిద్యాలయం పరిపాలన మొదలవుతుంది. వాస్తవానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటైన తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లో ఉండేది. దానికి అనుబంధంగా మన రాష్ట్రంలో రాజమహేంద్రవరం, శ్రీశైలం, కూచిపూడిలో పీఠాలు ఏర్పాటయ్యాయి. గత ఏడాది జూన్ నాటికి రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తికావడం, విభజన చట్టం ప్రకారం హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయంతో అనుబంధ సేవలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయాన్ని కేబినెట్ ఆమోదించినా వీసీ లేకపోవడంతో 2024-25 అడ్మిషన్లు జరగలేదు. సాధారణంగా జూన్‌లో నోటిఫికేషన్ ఇచ్చి ఆగస్టులో తరగతులు మొదలుపెట్టాలి. మరి ఈ విద్యా సంవత్సరాన్ని ఎలా మొదలెడతారో చూడాలి.

● రాష్ట్ర విభజన తర్వాత..

2014లో ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయిన తర్వాత ఏపీ రాష్ట్రంలో తెలుగు విశ్వవిద్యాలయం లేకుండా పోయింది. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న విశ్వవిద్యాలయం పేరు మార్పుతోపాటు ఏపీలోని విశ్వవిద్యాలయానికి సంబంధించిన మూడు పీఠాల నిర్వహణ అధ్వానం అయింది. బొమ్మూరులోని తెలుగు పీఠంలో గత ఏడాది నుంచి అడ్మిషన్లు ఆగిపోయాయి. జూలై 3వ తేదీన ఎంఏ తెలుగు చివరి బ్యాచ్ పరీక్షలు పూర్తి ఇక ఈ పీఠం ఉనికి ప్రశ్నార్థకమైంది. ఇటువంటి పరిస్థితిలో రాజమండ్రిలో తెలుగువిశ్వవిద్యాలయం ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటన ఈ పీఠానికే కాకుండా రాష్ట్ర ప్రజలకే ఓ తీయని శుభవార్తను అందించినట్టు అయింది. తెలుగు భాషకు, తెలుగు సాహిత్యానికి, తెలుగు కళలకు పూర్వ వైభవం వస్తుందనే అభిప్రాయం మొలకెత్తింది. ఆదికవి నన్నయ్య భారతాన్ని తెలుగులోకి అనువదించిన నేల రాజమహేంద్రవరం. తెలుగు సాంస్కృతిక, సాహిత్య వైభవం విరజిల్లిన ప్రాంతమిది. ఇక్కడ 1986 ఏప్రిల్‌లో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు తెలుగు భాషను ప్రోత్సహించే లక్ష్యంతో హైదరాబాద్‌లో ఉన్న తెలుగువిశ్వవిద్యాలయానికి అనుబంధంగా బొమ్మూరులో పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయ పీఠం ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. అదే సమయంలో రాష్ట్రంలో శ్రీశైలం, కూచిపూడిలలో కూడా తెలుగు విశ్వవిద్యాలయ పీఠాలు ఏర్పాటుచేశారు. తర్వాత బొమ్మూరు తెలుగు పీఠం ఓ వెలుగు వెలిగింది.

● తెలుగుసాహిత్య పీఠం నుంచి...

రాజమండ్రిలోని బొమ్మూరు కొండ మీద సుమారు 45 ఎకరాల భూమిలో తెలుగు సాహిత్య పీఠం ఉండగా, అదిప్పుడు తెలుగు విశ్వవిద్యాలయంగా విరాజిల్లనుంది. 1986లో ఈ పీఠానికి మొత్తం 45 ఎకరాల స్థలాన్ని అధికారికంగా ఇవ్వడంతోపాటు సమీపంలోని మరో 10 ఎకరాల భూమిని కూడా దఖలు పరిచారు. అడ్మినిస్ట్రేషన్ భవనం, దానిలో తరగతుల నిర్వహణ, హాస్టల్, హాస్టల్ మెస్, నాలుగు క్వార్టర్స్ కూడా నిర్మించారు. తొలి పీఠాధిపతిగా కొత్తపల్లి వీరభద్రరావు నియమితులయ్యారు. తర్వాత వరసగా బేతవోలు రామబ్రహ్మం, ఆర్వీఎస్ సుందరం, సి.రమణయ్య, బేతవోలు రామబ్రహ్మం, సి.రమణ్య, పొన్నా లీలావతి, ఎండ్లూరి సుధాకర్, గొల్లకోట సూర్య భాస్కరావు, చివరగా మళ్లీ ఎండ్లూరి సుధాకర్ ఇక్కడ పీఠాధిపతులుగా వ్యవహరించారు. తెలుగు సాహిత్య సభలకు, మరెన్నో గోష్ఠులకు ఈ కేంద్రం విలసిల్లింది. ఇక్కడ తెలుగు ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ తరగతులు నిర్వహించేవారు. మొదట తరగతికి 25 మంది విద్యార్థులతో ఇది మొదలైంది. ఇక్కడ ప్రముఖ ప్రవచనకారుడు గరికిపాటి నరసింహారావు తొలి ఎంఫిల్ బ్యాచ్ పట్టా పొందారు. ప్రముఖకవి అద్దేపల్లి రామ్మోహనరావు, విమర్శకుడు ద్వానాశాస్త్రి ఇక్కడ పీహెచ్‌డీ చేశారు. ఇక్కడ 300 మంది పీ హెచ్‌డీలు చేయగా, సుమారు 450 మంది ఎంఫిల్ చేశారు. 550 మంది తెలుగు ఎంఏ చేశారు.

● ప్రస్తుత పరిస్థితి

ఇక్కడ 14 మంది ఉద్యోగులు మాత్రం ఉన్నారు. అందులో కొందరు ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. భవనాలు దాదాపు శిథిలమయ్యాయి. కేవలం 20 ఎకరాల స్థలం మాత్రం మిగిలింది. కానీ ముఖ్యంగా 29 వేల పుస్తకాలతో గ్రంథాలయం మాత్రం నిత్యనూతనంగా ఉండడం విశేషం. ఇక్కడ ఉద్యోగులకు జీతాలు కూడా రాని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో బొమ్మూరు కొండపై ఉన్న భవనాలను ఆధునికీకరించాల్సిన అవసరం ఉంది. విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటుచేసేందుకు ప్రారంభ బడ్జెట్ కింద రూ.20 కోట్లు, జీతభత్యాలు-మౌలిక సదుపాయాల కింద మరో రూ.30 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. హైదరాబాద్ తెలుగువిశ్వవిద్యాలయంలో మొత్తం 22 విభాగాలు, 40 కోర్సులు ఉన్నాయి. వీటన్నింటినీ ఇక్కడ ప్రారంభించాలంటే 72 బోధన పోస్టులు, 115 బోధనేతర పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. అయితే ప్రస్తుతానికి డిమాండు ఉన్న కోర్సులను ప్రారంభించే అవకాశం మాత్రమే ఉంది. ఇది ఇక తెలుగుభాషా సాహిత్యం, సంస్కృతిలో ఉన్నత స్థాయి అధ్యయనం, బోధన, పరిశోధనా కేంద్రంగా పనిచేయనుంది.



జీజీహెచ్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి

ప్రజారోగ్యమే పరమావధిగా
వైద్యసేవలు అందించాలి

- అంకాలజీ విభాగంలో సమగ్ర వైద్యసేవలు అందుబాటులోకి
- ఖాళీ పోస్టుల భర్తీకి నవంబరు మొదటివారంలో నోటిఫికేషన్
- జీజీహెచ్‌లో వైద్యాధికారులతో సమీక్షా సమావేశంలో కలెక్టర్ కీర్తి

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వైద్యులు, సిబ్బంది ప్రజల ఆరోగ్యమే పరమావధిగా వైద్యసేవలు అందించాలని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. వైద్యసేవలు అందించే క్రమంలో ప్రతి వైద్యుడు ప్రజల కోసం పనిచేస్తున్నామనే భావనతో విధులు నిర్వర్తించాలని సూచించారు. గురువారం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ బోధనాసుపత్రి (జీజీహెచ్)లో వివిధ విభాగాల హెచ్‌వోడీలు, వైద్యులు, వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్యసేవలు, మౌలిక వసతులు, వైద్య పరికరాల పరిస్థితి, సిబ్బంది కొరత, నిర్మాణ పనుల పురోగతి తదితర అంశాలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రి అధికారులు వైద్యసేవలతోపాటు ఆసుపత్రి పరిశుభ్రత, తాగునీటి సదుపాయం, భద్రతా ఏర్పాట్లపైనా దృష్టి పెట్టాలన్నారు. కేన్సర్ అనుబంధ వైద్య సేవల విభాగంలో అంకాలజీ విభాగం ద్వారా రోగులకు సమగ్ర వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని, ఈ విభాగంలో స్పెషలిస్టు వైద్యులు రోగులకు కేన్సర్ నిర్ధారణ, చికిత్స, కౌన్సెలింగ్, ఫాలోఅప్ సేవలు అందిస్తున్నారన్నారు. జీజీహెచ్‌లో మొత్తం 484 పోస్టులు మంజూరయ్యాయని, వీటిలో 326 పోస్టులు భర్తీకాగా 158 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఖాళీగా ఉన్న పారామెడికల్ సిబ్బంది, టెక్నీషియన్ పోస్టులభర్తీకి నవంబరు తొలివారంలో నోటిఫికేషన్ జారీచేయాలన్నారు. 50 పడకలతో నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ బ్లాకు పనులు 75 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులు ఈనెలాఖరునాటికి పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మార్చురీ విభాగంలో ఫ్రీజర్ల కొరత నివారణకు చర్యలు తీసుకోవాలని, మార్చురీ సమీపంలో టాయిలెట్లు నిర్మించాలని అన్నారు. పీడియాట్రిక్స్ విభాగంలోని ఎస్ఎన్‌సీయూలో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లను నియమించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పల్మనాలజిస్టును జీజీహెచ్‌కు డిప్యూట్ చేయాలని డీఎంఅండ్‌హెచ్‌వోకు సూచించారు. ఈ సమావేశంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.భాస్కరరెడ్డి, వివిధ వైద్య విభాగాల హెచ్‌వోడీలు, వైద్యాధికారులు పాల్గొన్నారు.



ఇది.. యాపారం!

సోషల్ మీడియాలో అధికార పార్టీ నాయకుడి ఆడియో సంభాషణ

లిక్కర్ వ్యాపారంపై సిట్టింగ్‌లు

రాజమహేంద్రవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరంలో అధికార పార్టీ నాయకుడు ఒకరు ఫోన్‌లో ఓ షాపు నిర్వాహకుడితో చేసిన సంభాషణ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇది రాజకీయ వర్గాల్లోనూ, లిక్కర్ వ్యాపారుల్లోనూ చర్చనీయాంశమైంది. అధికార పార్టీకి చెందిన ఒక నాయకుడు పార్టీలో కీలక బాధ్యతలు ఇటీవల చేపట్టారు. గత నెల చివరిలో ఒక ప్రముఖ హోటల్‌లో లిక్కర్ వ్యాపారులు, నార్త్, సౌత్ ఎక్సయిజ్ అధికారులతో కలిపి మీటింగ్ నిర్వహించినట్టు ఈ ఆడియో సంభాషణను బట్టి తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఓ వ్యాపారికి సదరు నాయకుడు ఫోన్ చేసి తన పేరు చెప్పి పరిచయం చేసుకున్నాడు. తర్వాత ఫలానా హోటల్‌లో మీటింగ్ ఉందని.. రావాలని ఆహ్వానించారు. ఏంటి మీటింగ్ అని అటువైపు వ్యాపారి ప్రశ్నించగా.. ధరలు పెచ్చుచేసుకోవడం, బెల్ట్‌షాపులు, కేసులేమైనా వస్తే కలిసి భరించడం వంటి అంశాలపై మాట్లాడుకుందామని ఆయన వివరించారు. నార్త్, సౌత్ ఎక్సయిజ్ అధికారులతో ఇప్పటికే మాట్లాడామని, వారు కొన్ని ఆఫర్స్ పెట్టారని, అది కూడా చర్చిస్తామన్నారు. రూ.2 లక్షలు, రూ.2.5 లక్షల కౌంటర్ల ఉన్న షాపులపై ఏదైనా కేసు పెడితే అందరూ కలసి భరించేటట్టు నిర్ణయంతోపాటు అధికారులు కేసులు అడిగితే సిటీలో 28 షాపులకు లాటరీ వేసి, అందులో ఒకటి తీసి, వచ్చిన షాపు పేరిట కేసు ఇచ్చేటట్టు నిర్ణయం తీసుకోనున్నామన్నారు. సిటీ, రూరల్‌లో 39 షాపులు కలసి ఉండాలని సెలవిచ్చారు.



కొవ్వూరు పట్టణంలో గోదావరి స్నానఘట్టాలను బోట్‌పై పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ కీర్తి

బోట్‌లోనే జిల్లా కలెక్టర్ సమీక్ష

కొవ్వూరు గోదావరి ఘాట్ల పరిశీలన.. అధికారులు, స్థానిక నాయకులతో చర్చలు

కొవ్వూరు,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): 2027లో గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తుల భద్రత, పారిశుధ్యంపై అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో గురువారం స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఏపీ టూరిజం బోట్‌లో పర్యటించి స్నానఘట్టాలను పరిశీలించారు. గోష్పాదక్షేత్రం నుంచి కృష్ణ చైతన్య, భక్తాంజనేయ, సుబ్రహ్మణ్యఘాట్, పిండప్రదానం రేవు, క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్, హేవలాక్ వంతెన, శ్రీనివాస స్నానఘట్టం, ఏరినమ్మ ఘాట్‌లను బోట్‌లో నుంచే పరిశీలించారు. బోటులోనే అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి మాట్లాడుతూ రానున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ముఖ్యమంత్రి.. మంత్రుల బృందంతో సమీక్షా సమావేశాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. జిల్లా స్థాయిలో అన్నిశాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు సన్నాహాలు వేగవంతం చేసే విధానంలో ప్రధాన ఘాట్లను పరిశీలించినట్టు చెప్పారు. త్వరలో రాష్ట్రస్థాయి పర్యవేక్షక బృందం జిల్లాలో పర్యటించే అవకాశం ఉందన్నారు.

పర్యాటక ప్రాజెక్టుపై సమీక్ష

కొవ్వూరులో గోదావరి ఒడ్డున నిర్మాణంలో ఉన్న పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టు వివరాలు అడిగి తెలుసుకున్నారు. 26 కాటేజ్‌లు, బార్, రెస్టారెంటు, స్విమ్మింగ్ పూల్, కాన్ఫరెన్స్ హాలు వంటి సౌకర్యాలతో 60 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. మిగిలిన పనులు త్వరితగతిన ప్రారంభించి పుష్కరాలకు ముందే పూర్తి చేయాలన్నారు. ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, ఇరిగేషన్ ఈఈ జి.శ్రీనివాస్, జిల్లా టూరిజం అధికారి పి.వెంకటాచలం, ఆర్డీవో రాణి సుస్మిత, సూరపనేని చిన్ని, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, బర్ల శ్రీనివాసరావు, శ్రీవత్సవ కన్సల్‌టెంట్ బి.కిరణ్, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలోని సాంఘిక సంక్షేమశాఖ నెం.1 కాలేజీ బాలుర హాస్టల్

హాస్టల్ 'పంచాయితీ'

పోలీసులకు ఫిర్యాదు చేసిన లేడీవార్డెన్, లేడీవార్డెన్‌పై ఇటీవలే హాస్టల్ నుంచి బయటకెళ్లిన విద్యార్థి ఫిర్యాదు

డీఎస్‌డబ్ల్యువో సమక్షంలో ఇరువర్గాల చర్చలు.. పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాల ఫిర్యాదుల ఉపసంహరణ

రాజమహేంద్రవరంఅర్బన్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని సాంఘిక సంక్షేమశాఖ కాలేజీ బాలుర హాస్టల్ నెం.1లో ఆందోళనకర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇక్కడ ఇన్‌చార్జిగా ఉన్న లేడీవార్డెన్‌కు, హాస్టల్‌లోని కొందరు విద్యార్థులకు మధ్య కొంత కాలంగా కోల్డ్‌వార్ జరుగుతోంది. అదికాస్తా తారస్థాయికి చేరుకుని ఇటీవల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుల వరకూ వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. సెమిస్టర్ ఒకటి పూర్తికాకుండానే హాస్టల్‌లో చదువు ముగించి ఇటీవలే బయటకు వెళ్లిన ఒక విద్యార్థిపై లేడీవార్డెన్ పోలీసులకు ఫిర్యాదు చేయడం, దీనికి ప్రతిగా సదరు విద్యార్థి కూడా కౌంటర్ ఫిర్యాదు చేయడం, మర్నాడు లేడీ వార్డెన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి మరో ఫిర్యాదు ఇవ్వడం సమస్య తీవ్రతకు అద్దంపడుతోంది. అలాగే ఇటీవల దసరా సెలవుల సమయంలో అందరూ బయటకు వెళ్లిపోవాలని, హాస్టల్‌లో ఒక్కరు కూడా ఉండకూడదని చెబుతూ లేడీ వార్డెన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు విద్యార్థులను ఆందోళనకు గురిచేసింది. విద్యార్థులపై పోలీసులకు ఫిర్యాదులు, మెనూ సక్రమంగా పెట్టకపోవడం, ఇక్కడ ఇన్‌ఛార్జిగా ఉన్న లేడీ వార్డెన్ గతంలో రాజమహేంద్రవరంలో పనిచేసిన ఒక హాస్టల్‌కు సంబంధించి విద్యార్థుల మాన్యువల్ హాజరుపై ఆర్‌టీఐలో సమాచారం కోరడం వంటి పలు అంశాలు ఈ పరిణామాలు, పరిస్థితులకు ప్రధానకారణంగా తెలిసింది. వీటితోపాటు 'దసరా సెలవులు-హాస్టల్ బియ్యం' ఆరోపణలపై హాస్టల్‌లో పనిచేస్తున్న ఉద్యోగి ఒకరిని కొందరు విద్యార్థులు నిలదీసిన తీసిన అంశం వీటన్నింటికీ ప్రధాన మూలకారణంగా ప్రచారం జరుగుతోంది. ఆ ఉద్యోగిని విజిలెన్స్ అధికారులు ప్రశ్నిస్తే వాస్తవాలు బయటకు వస్తాయని, చిక్కుముడి వీడిపోతుందని కూడా చెప్పుకుంటున్నారు. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోని నెం.1 బాలుర కాలేజీ హాస్టల్‌లో ఇంత జరుగుతున్నా జిల్లా సాంఘిక సంక్షేమ అధికారులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోకపోవడం, సమస్యను గుర్తించి పరిష్కరించేందుకు ప్రయత్నించకపోవడం ఇప్పుడు జిల్లా సాంఘిక సంక్షేమశాఖలో అంతర్గతంగా తీవ్ర దుమారం రేపుతోంది.

● డీఎస్‌డబ్ల్యువో కార్యాలయంలో..

కాగా, హాస్టల్ లేడీ వార్డెన్‌కు, విద్యార్థులకు మధ్య కోల్డ్‌వార్ నేపథ్యంలో ఇరువర్గాలు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకోవంతో డీఎస్‌డబ్ల్యువో సోమవారం రాత్రి తన కార్యాలయంలో ఇరువర్గాలతోనూ 'పంచాయితీ' నిర్వహించినట్టు సమాచారం. రెండు వర్గాలతో చర్చలు జరిపి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని, లేకుంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఈ సందర్భంగా అధికారులు, నేతలు విద్యార్థులపై ఒత్తిడి తెచ్చినట్టు తెలిసింది. హాస్టల్‌లో జరుగుతున్న అక్రమాలు, ఇతర పరిణామాలు, తాము పడుతున్న ఇబ్బందులు చెప్పుకునే అవకాశం కూడా ఇవ్వరా అని కొందరు విద్యార్థులు నిలదీసినట్టు సమాచారం. చివరకు అదేరోజు రాత్రి ఇరువర్గాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు ఉపసంహరించుకున్నారని తెలిసింది. ఇదిలా ఉంటే కాలేజీ హాస్టల్ కావడంతో యుక్త వయస్సులోని వాళ్లే ఉంటారు. లేడీ వార్డెన్‌ను ఇన్‌ఛార్జిగా నియమించడం ఇక్కడి విద్యార్థుల్లో అసంతృప్తికి ఒక కారణంగా చెబుతున్నారు. లేడీ వార్డెన్ కావడం వల్ల తాము హాస్టల్‌లో ఏ సమస్య చెప్పుకోవాలన్నా, వ్యక్తిగత ఇబ్బందులు తెలియజేయాలన్నా ఇబ్బందికరంగా ఉంటున్నదని వీరు చెబుతున్నారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జిగా ఉన్న లేడీ వార్డెన్ కోరుకొండలో ఎస్సీ హాస్టల్‌కు రెగ్యులర్ వార్డెన్‌గా ఉన్నారు. అక్కడి వార్డెన్‌ను తీసుకొచ్చి ఇక్కడ ఇన్‌ఛార్జిగా వేయడం ఏమిటనే ప్రశ్నా తలెత్తుతోంది. నెం.1 కాలేజీ బాలుర హాస్టల్‌లో ప్రస్తుతం 160 మంది వరకూ విద్యార్థులు ఉంటున్నారు. వివిధ కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ, పీజీ కోర్సులు చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే ఈ హాస్టల్‌పై దృష్టిసారించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రాహుల్‌మీనా

పుష్కరాల నాటికి రాజమహేంద్రవరాన్ని అన్ని సదుపాయాలతో సిద్ధం చేయాలి

గోదావరి పుష్కర పనులపై కమిషనర్ రాహుల్‌మీనా సమీక్ష

రాజమహేంద్రవరంసిటీ, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలు -2027ని దృష్టిలో పెట్టుకుని రాజమహేంద్రవరాన్ని అన్ని మౌలిక సదుపాయాలతో సిద్ధంచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్‌మీనా ఆదేశించారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం గోదావరి పుష్కర పనులపై సమీక్షలో కమిషనర్ మాట్లాడారు. గోదావరి పుష్కరాలకు 21 నెలల వ్యవధి ఉందన్నారు. అందువల్ల వేగంగా నగరపాలక సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. శాశ్వత మౌలిక వసతులపై దృష్టిపెట్టాలన్నారు. లక్షల్లో భక్తులు రాజమహేంద్రవరానికి వస్తారని, ఎక్కడా ఇబ్బంది లేకుండా రహదారుల నిర్మాణం, వాహనాల పార్కింగ్, తాగునీరు, స్నానాల ఘాట్లు వంటి అన్ని వసతులు ఉండేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. పుష్కరాల్లో రద్దీని నియంత్రణ కోసం ప్రతీ ఘాట్ వద్ద ఏఐ టెక్నాలజీ స్మార్ట్ పోల్స్ ఏర్పాటుచేయాలని సూచించారు. దీని ద్వారా ఏఐ సహాయంతో భక్తుల రద్దీని ముందుగానే పసిగట్టి ప్రమాదాలు నివారించవచ్చన్నారు. కుంభమేళాలో ఈ విధానం విజయవంతమైందన్నారు. భక్తులకు సరిపడా వసతి సౌకర్యాలు కల్పించాలని, అందుకోసం నగరంలో కల్యాణ మండపాలు, పాఠశాలలు, హోటళ్లు, గెస్ట్‌హౌస్‌లను చూడాలన్నారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ శైలజవల్లి, ఎస్ఈ ఇంచార్జి రీటా, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, అధికారులు పాల్గొన్నారు.





బ్రహ్మోత్సవాల్లో ఉత్సవమూర్తులకు మహా స్నపనం (పక్కన) లక్ష తులసి పూజ

రాజాధిరాజా..

రాజాధిరాజ అలంకరణలో
గజ వాహనంపై శ్రీవారి విహారం
ఘనంగా లక్షతులసి పూజా మహోత్సవం
స్వామివారికి తిరుప్పావడ సేవ..
బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజు





వరుసగా.. స్వామివారికి మిరియాల దండను తీసుకువస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు.. తిరుప్పావడ సేవ.. ప్రత్యేక నృత్య ప్రదర్శన

ఆత్రేయపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఏడవ రోజు గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వసంతమండపంలో వివిధ రకాల ఫల, పుష్పాలతో అలంకరించిన మండపంలో ఉత్సవమూర్తులు కొలువుతీరారు. ఉత్సవమూర్తులకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, అష్టకలశారాధన, స్నపనము వంటివి వేదమంత్రాల మధ్య నిర్వహించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ప్రముఖ డోనర్ బొరుసు భాస్కరరావు-వసుధ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రచారం ఖండవల్లి వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు, అర్చకులు లక్ష తులసి పూజా మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్ ఎదురుగా అంతరాలయంలో తిరుప్పావడ సేవ నిర్వహించారు. అశేష భక్తజనం పాల్గొని కనులారా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు పూజల్లో పాల్గొన్నారు. రాత్రి రాజాధిరాజ అలంకరణలో శ్రీవారు అలంకృతుడై గజ వాహనం అధిరోహించి వేలాది మంది భక్తుల గోవిందనామస్మరణతో తిరు వీధుల్లో విహరించి భక్తులకు అభయహస్తం అందించారు.





వాడపల్లి వేంకటేశ్వరస్వామి మహాలడ్డు ప్రసాదాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వెంకన్న ఆలయంలో మహాలడ్డు ప్రసాదం

450 గ్రాముల ధర రూ.100.. ప్రారంభించిన బండారు

ఆత్రేయపురం, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా మహాలడ్డు ప్రసాదాన్ని ప్రవేశపెట్టారు. తిరుమల తరహాలో లడ్డు ప్రసాదాన్ని నాణ్యతా ప్రమాణంతో నిర్వహిస్తున్నారు. 450 గ్రాములతో తయారు చేసిన లడ్డును బాక్సులో ప్యాక్ చేసి రూ.100 ధరతో భక్తులకు అందించేలా నిర్ణయించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రసాదాన్ని భక్తులకు అందించే కార్యక్రమం నిర్వహించారు. చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు పాల్గొన్నారు.



ప్రధాని సభకు ముస్లిం మహిళలు



సభకు వేలాది బస్సులు ఇలా...



మోదీతో చంద్రబాబు, పవన్











నమో..జోష్

'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' పేరిట కర్నూలులో గురువారం జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన విజయవంతమైంది. శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఆయన తిరిగి కర్నూలుకు చేరుకున్నారు. ప్రధానితో పాటు సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ రావడంతో కూటమి శ్రేణులు భారీగా తరలివచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలతో సభాప్రాంగణం నిండిపోయింది. ఓర్వకల్లు మండలం కర్నూలు-నంద్యాల జాతీయ రహదారి పక్కన నన్నూరు రాగమయూరి వెంచర్‌లో ఏర్పాటు చేసిన ప్రధాని సభకు దాదాపు 3 లక్షల మందికి పైగా ప్రజలు తరలివచ్చారు. వేలాది వాహనాల్లో తరలి రావడంతో కర్నూలు కిక్కిరిసిపోయింది. ఇక సభావేదిక వద్ద తెలుగుదేశం పార్టీ యువత కదనోత్సాహం... జనసైనికుల ఆనందం.. బీజేపీ శ్రేణుల కోలాహలం.. వెరసి ప్రధాని సభ సూపర్ సక్సెస్ అయింది.

- కర్నూలు (ఆంధ్రజ్యోతి)



సభలో ఉప్పొంగిన దేశభక్తి



సభలో టీడీపీ మహిళా నేతలు





శివాజీ స్ఫూర్తి కేంద్రంలో మోదీ





పొలాల వెంబడి పరుగులు





యానాం గోదావరిలో భారీగా లభ్యమైన చీరమేను, కొనుగోలు దారులతో కిక్కిరిసిన పుష్కర ఘాట్

చీరమేను... సందడి

- యానాం మార్కెట్‌లో శేరు రూ.1,500కు లభ్యం
- చౌక ధర అంటూ భారీగా తరలివచ్చిన కొనుగోలుదారులు
- మత్స్యకారులకు కాసుల వర్షం

యానాం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అంతర్భాగంగా ఉన్న కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలో చీరమేను సందడి చేసింది. యానాం, గోదావరి జిల్లా వాసులు, మాంసాహారప్రియులు ఎంతో ఇష్టంగా తినే చేరమేను దీపావళి ముందు ఎక్కువగా దొరుకుతుంది. తూర్పు గాలుల సమయంలో నీటి అడుగు భాగం నుంచి ఉపరి తలంపైకి చేరుకుంటాయి. యానాంలో గురువారం అధిక సంఖ్యలో చీరమేను దొరికి మత్స్యకారులకు కాసుల వర్షం కురిపించింది. ఉదయం నుంచి పెద్ద మొత్తంలో చీరమేను మార్కెట్‌కు



రావడంతో రాజీవ్‌గాంధీ బీచ్‌లోని పుష్కర ఘాట్ వద్ద సందడి వాతావరణం నెలకొంది. బకెట్, బిందెల్లో (ఒక్కో బకెట్ సుమారు 10 లీటర్లు) చీరమేను లభ్యమైనట్టు తెలిసింది. రెండు రోజుల క్రితం శేరు (ఒక లీటరు) రూ.2వేలకు పైగా అమ్ముడైంది. ప్రస్తుతం శేరు రూ.1,500 నుంచి రూ.1,600 వరకు అమ్ముతున్నారు. చీరమేను చౌకగా దొరుకుతోందని తెలియడంతో మాంసాహారప్రియులు భారీగా వచ్చారు. కొందరు సేర్లు, మరికొందరు బకెట్‌లతో కొనుగోలు చేశారు. దీపావళి ముందు రోజుల్లో చీరమేను పడటం సహజం. అయితే గోదావరిలో తెల్ల నీరు (మురికిగా కాకుండా) తేలిపోవడంతో చీరమేను అధిక సంఖ్యలో లభ్యమవుతోందని స్థానిక మత్స్యకారులు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

సత్యదీక్షలకు వేళాయె

నేటి నుంచి ప్రారంభం... వచ్చే నెల 13న విరమణ

అన్నవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవునికి అత్యంత ఇష్టమైన సత్య దీక్షలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఆశ్వయుజ మాసంలో మఖ నక్షత్రం నాడు మొదలయ్యే దీక్షలు కార్తిక మాసంలో వచ్చే మఖ నక్షత్రంతో ముగుస్తాయి. వీటికి సంబంధించి దేవస్థానం యంత్రాంగం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసింది. గిరిజన ప్రాంతాలు, అన్నవరం పరిసర ప్రాంతాల్లో దీక్షలు తీసుకునే ఆసక్తి ఉన్న 1,500 మందికి దీక్షా వస్త్రాలు, దీక్షా మాలలు ఉచితంగా అందజేశారు. సత్య రథం ద్వారా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా గ్రామగ్రామాన ప్రచారం గావించారు. 27 రోజులు అత్యంత నియమనిష్టలతో దీక్ష ఆచరించాలి. 27 రోజులు దీక్ష కుదరని మహిళలు, ఇతరులు 18 రోజులు, 9 రోజులు దీక్ష స్వీకరించవచ్చు. దీక్ష ఎక్కడ తీసుకున్నా సత్యదేవుని సన్నిధిలోనే ఇరుముడి సమర్పించి విరమించాలి. 27 రోజుల దీక్షలు ఈ నెల 17న, 18 రోజుల దీక్ష ఈ నెల 26న, 9 రోజుల దీక్ష వచ్చే



సత్యదీక్షా ధారణలో భక్తులు (పాత చిత్రం)

నెల 4న స్వీకరించాలి. దీక్ష ఎప్పుడు తీసుకున్నా నవంబరు 13న విరమించాల్సి ఉంటుంది. దీక్షా కాలంలో ఎంతో భక్తి శ్రద్ధలతో ఉండాలి. పసుపు రంగు దుస్తులు ధరించి మగవారిని సత్యదేవ, ఆడవారిని సత్యదేవిగా సంబోధించాలి. త్రికరణ శుద్ధిగా బ్రహ్మచర్యం పాటించాలి. ధూమపానం, మద్యపానం వదిలి మాంసాహారం భుజించకూడదు. నేలపైనే నిద్రించాలి. అబద్ధమాడరాదు. ఎంతో నియమనిష్టలతో ఆచరించడం ద్వారా ఆయురారోగ్యాలు కలిగి సుఖసంతోషాలతో ఉంటారని భక్తుల ప్రగాఢ విశ్వాసం.



శ్రీనివాసరావుకు పతకాలు, మెమెంటో అందజేస్తున్న నేషనల్ రిఫరీ లక్ష్మీదయానంద

ఆయన ఖాతాలో మరో నాలుగు

జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాసరావు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో కాకినాడ ఆర్టీసీ డ్రైవర్ ఎం.శ్రీనివాసరావు నాలుగు బంగారు పతకాలు సాధించారు. నవంబరులో భూటాన్‌లో జరిగే అంతర్జాతీయ, జనవరిలో బెంగళూరులో జరిగే మాస్టర్స్ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఇప్పటివరకు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో మొత్తం 91 పతకాలు సాధించిన శ్రీనివాసరావుకు పలువురు అభినందనలు తెలిపారు.



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ కృష్ణారెడ్డి

'విద్యా రంగం అభివృద్ధికి ఎన్‌సీఈఆర్‌టీ కృషి'

సర్పవరం జంక్షన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది... అభివృద్ధి, సంక్షేమ పథకాలు, సంస్కరణలతో విద్యారంగం అభివృద్ధికి విశేష కృషి చేస్తోందని జాతీయ విద్యా పరిశోధన శిక్షణా సంస్థ (ఎన్‌సీఈఆర్‌టీ) డైరెక్టర్ కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం ఆయన కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలంలోని ఏపీఎస్పీ జడ్పీ హైస్కూల్, హైస్కూల్ ప్లస్ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు పటిష్టమైన పనితీరు కనబర్చాలన్నారు. టెస్ట్, నోట్ పుస్తకాలను సమగ్రంగా పర్యవేక్షించాలని, విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య బోధించాలన్నారు. పాఠ్య పుస్తకాల్లోని పలు అంశాలను వివిధ స్థాయిల్లో ఉన్న విద్యార్థులకు బోధించే పద్ధతి, మూల్యాంకనంపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు తరచూ పునశ్చరణ తరగతులు నిర్వహించుకుని బోధనా సామర్థ్యాలను మరింత పెంచుకోవాలని కోరారు. పాఠశాల ప్రాంగణం పరిశుభ్రంగా పచ్చదనంతో ఉండడాన్ని గమనించి అందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. తరగతి గదుల్లోకి వెళ్లి పది, ఇంటర్ విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా సామర్థ్యాలను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్ ప్రధానోపాధ్యాయురాలు కె.గాయత్రిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎన్‌సీఈఆర్‌టీ రైటర్ రమేష్, డీవైఈవో కేవీవీ సత్యనారాయణ, డీసీఈబీ సెక్రటరీ వెంకట్రావు, పాఠశాల ఇన్‌చార్జి శ్రీనివాస్, ఉపాధ్యాయులు చామంతి నాగేశ్వరరావు, కందుకూరి పాల్‌రాజు, ఉద్దగిరి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

50 అత్తాలు... 850 కాయలు

కర్పూర రకానికి చెందిన ఒక అరటి చెట్టు ఏకంగా 50 అత్తాలతో అబ్బురపరుస్తోంది. కాకినాడ జిల్లా కరపలో టీడీపీ మండల అధ్యక్షుడు దేవు వెంకటేశ్వరరావు ఇంటి పెరట్లోని అరటి చెట్టుకు 50 అత్తాలుండగా ఒక్కో అత్తానికి 15 నుంచి 17వరకు కాయలున్నాయి. దాదాపు 850 కాయలున్నాయని ఆయన కుమారుడు వీరేష్ లెక్కకట్టి చెప్పాడు.

- కరప (ఆంధ్రజ్యోతి)





బాలబాలాజీస్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజన సేవ నిర్వహిస్తున్న అర్చకులు

కనుల పండువగా స్నపన తిరుమంజనం

అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో రెండో రోజుకు పవిత్రోత్సవాలు

మామిడికుదురు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో పవిత్రోత్సవాలు రెండో రోజుకు చేరుకున్నాయి. గురువారం స్నపన తిరుమంజన సేవ కనుల పండువగా జరిగింది. చతుస్థానార్చనలతో ప్రారంభమైన ఉత్సవాల్లో అగ్ని ప్రతిష్ఠాపన, పవిత్రారోహణ పూజలనుశాస్త్రోక్తంగా నిర్వహించారు. 27 కలశల్లో తీసుకువచ్చిన పంచామృతాలు, 11 రకాల పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలు, ఉద్ధ జలాలతో బాలబాలాజీ స్వామితో పాటు పద్మావతీదేవి, ఆండాళ్‌తాయార్‌లకు తిరుమంజనం జరిపారు. అనంతరం ప్రాయశ్చిత హోమం, నివేదన, తీర్థ ప్రసాదగోష్ఠి, చతుస్థానార్చనలు, మంగళాశాసనం జరిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తుల మనసులను రంజింపచేశాయి. శ్రీమాన్ త్రిదండి శ్రీమన్నారాయణ రామనుజ చినజీయర్ స్వామిజీ శిష్య బృందం, గుడివాడకు చెందిన చలమచర్ల మురళీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ సహాయ కమిషనరు ఎం.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు వీక్షించి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గోదావరి జిల్లాల గొప్పతనాన్ని చెప్పేందుకే

ఆహార పదార్థాల ప్రదర్శన

● నన్నయ వీసీ ప్రసన్నశ్రీ ● ముగిసిన ఆహార మహోత్సవ్



విజేతలకు బహుమతులను అందజేస్తున్న వీసీ ప్రసన్నశ్రీ, రిజిస్ట్రార్ స్వామి

దివాన్‌చెరువు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సైన్స్, టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మూడురోజులపాటు జరిగిన ఆహార మహోత్సవ్ కార్యక్రమం గురవారంతో ముగిసింది. మూడోరోజైన గురువారం విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో పశ్చిమగోదావరిజిల్లా ఫుడ్‌స్టాల్ ప్రదర్శన కార్యక్రమం జరిగింది. నన్నయ అనుబంధ కళాశాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు హాజరై 84 స్టాల్స్‌లో తమ ఆహారపదార్థాలను ప్రదర్శించారు. పండుగ వాతావరణంలో జరిగిన ఈకార్యక్రమాన్ని విద్యార్థినీ, విద్యార్థులు, అధ్యాపకులు ఆశక్తిగా తిలకించారు. ఈసందర్భంగా వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ ఆరోగ్యకరకరమైన అలవాట్లను, వంటకాలను ఆరోగ్యకరమైన జీవితాన్ని గోదావరిజిల్లా గొప్పతనాన్ని తెలియజేసే ప్రయత్నమే ఈకార్యక్రమం లక్ష్యం అని అన్నారు. తమ లక్ష్యం నెరవేరిందని చెప్పారు. అనంతరం శాఖాహార, మాంసాహార విభాగాలలో విజేతలైన వారికి వీసీ ప్రసన్నశ్రీ, విశ్వవిద్యాలయ అధికారులు, న్యాయనిర్ణేతలు బహుమతులను అందజేశారు. రెండురోజుల ఆహార మహోత్సవ్‌లో స్టాల్స్‌ను ఏర్పాటుచేసిన వారికి ప్రసంశాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.వి.స్వామి, ప్రిన్సిపాల్‌లు పి.విజయనిర్మల, పి.వెంకటేశ్వరరావు, విభాగాధిపతి డి.కళ్యాణి, అధ్యాపకులు టి.హైమావతి, బి.ఉషశ్రీ, శాంతరాజ్యం, ఎం.ఎం.కృష్ణవేణి,టి.సింధూజ పాల్గొన్నారు.

విజేతలు వీరే

● శాఖాహారవంటకాలలో మొదటిస్థానం సున్నుండలు, కారప్పూస చేసిన హయగ్రీవ బీఈడీ కళాశాల చింతలపూడి డి.కీర్తి, చల్లా స్వర్ణలత, రెండో స్థానం కొబ్బరిపాలతో వంకాయపచ్చడి చేసిన విశ్వవిద్యాలయం మెకానికల్ విద్యార్థి జి.ఆదర్శ్ మూడోస్థానం గోంగూర బిర్యానీ, సొరకాయ హల్వా, లచ్చించారు, ఉలవచారు చేసిన బి.వి.రాజు కళాశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ప్రోత్సాహక బహుమతులను ఎస్.కె.సుల్తానా, కె.అమృత, డాక్టర్ ఉమామణి, ఎం.హర్షితనాగశ్రీ, దేవలాల్ అందుకున్నారు.

●మాంసాహార వంటకాలలో మొదటి స్థానం ఎండుచేపకూర చేసిన విశ్వవిద్యాలయం బాలికల వసతిగృహం విద్యార్థులు, రెండోస్థానం చికెన్ ఫ్రైడ్‌రైస్ చేసిన నన్నయ విశ్వవిద్యాలయం కుమారి, మూడోస్థానం కుండలో కోడికూర, చద్దన్నంకు ఫిజిక్స్ విభాగం నుంచి క్రాంతి అందుకున్నారు. ప్రోత్సాహక బహుమతులు నన్నయ విశ్వవిద్యాలయం ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం నుంచి జి.చంద్రకళ, తాడేపల్లిగూడెం ప్రాంగణం నుంచి ఎస్.ఉషారామ్, బీఈడీ విద్యార్థి జి.రమ్యా, ఎంబీఏ విద్యార్థి వి.సాహితీలు అందుకున్నారు.

అనుమానంతో భర్త, అత్త వేధింపులు

● వివాహిత ఆత్మహత్య
● నువ్వంటే నిజంగా చాలా ఇష్టం అంటూ లేఖ



మృతదేహాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్, ఎస్ఐ

తొండంగి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం గోపాలపట్నంలో భర్త వేధింపులు, అత్త సూటిపోటీ మాటలు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళంజిల్లా పాతపట్నం మండలం తిడ్డిమి గ్రామానికి చెందిన గొర్లి బుద్ధుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా మలికిపురం మండలం లక్కవరం గ్రామంలో నివాసముంటున్నారు. ఈయన కుమార్తె శిరీష బీకాం కంప్యూటర్స్ చదివింది. ఈమెకు గత మేనెల 15న పాతపట్నం గ్రామానికి చెందిన ఏనుగుతల ప్రదీప్‌కుమార్‌తో వివాహం జరిగింది. ప్రదీప్ తొండంగి మండలంలోని దివీస్ ఫార్మా కంపెనీలో పనిచేస్తుండగా భార్యాభర్తలతో గోపాలపట్నంలో ఆగస్టు నెలలో కాపురం పెట్టించారు. వీరింటికి తరచూ ప్రదీప్ తల్లి ఏనుగుతల నాగమ్మ వచ్చి వెళ్తూ ఉండేది. తల్లి మాటలు విని ప్రదీప్ తన భార్యను తరచూ వేధించేవాడు. ఫోనులో శిరీష ఎవరితోనో ఛాటింగ్ చేస్తోందన్న అనుమానంతో తరచూ వేధింపులకు గురిచేస్తుండేవాడు. అనుమానంతో భర్త కొడుతున్నాడని, వేధింపులు భరించలేకపోతున్నానని తల్లిదండ్రులకు ఆమె ఫోన్‌చేసి చెప్పి ఏడ్చేది. బుధవారం కూడా తల్లిదండ్రులకు వేధింపులు భరించలేకపోతున్నానని ఫోన్ చేసి చెప్పింది. వాళ్లు మళ్లీ ఫోన్ చేయగా తీయడంలేదు. దీంతో అనుమానం వచ్చి వారు గోపాలపట్నం బయలుదేరి వచ్చారు. అప్పటికే శిరీష చున్నీతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయి ఉంది. ఆమె రాసిన సూసైడ్ నోట్‌లో తన మృతికి తన అత్త నాగమ్మ, భర్త ప్రదీప్‌లే కారణమని ఉంది. తనకు, భర్త అనుమానిస్తున్న వ్యక్తికి ఎటువంటి సంబంధంలేదని, భర్త పెడుతున్న వేధింపులు భరించడం తనవల్ల కావడం లేదని లేఖలో పేర్కొంది. ఎటువంటి గొడవలు పడకండి, నువ్వు మంచిగా ఉండు.. నువ్వంటే చాలాఇష్టం.. మిస్ యు ప్రదీప్ అంటూ ముగించింది. దీనిపై మృతురాలి తండ్రి బుద్ధుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొండంగి ఎస్ఐ జగన్మోహన్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. తహశీల్దార్ కాంతారావు సంఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు.

ద.మ.రైల్వే పీసీఎండీ హెల్త్ యూనిట్ తనిఖీ



హెల్త్ యూనిట్‌ని పరిశీలిస్తున్న పీసీఎండీ డాక్టర్ నిర్మలా రాజారామ్

రాజమహేంద్రవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిర్మలా రాజారామ్ గురువారం రాజమండ్రి రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేశారు. కాకినాడ నుంచి మధ్యాహ్నం చేరుకొని రైల్వే హెల్త్ యూనిట్, యాక్సిడెంట్ రిలీఫ్ మెడికల్ వ్యాన్(ఏఆర్‌ఎంవీ)ని పరిశీలించారు. హెల్త్ యూనిట్‌లోని ఫార్మసీ, ల్యాబ్, రిజస్టర్లు చూశారు. రోగులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఏఆర్‌ఎంవీలోని అత్యవసర వైద్యఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం తిరిగి కాకినాడ వెళ్లారు. కార్యక్రమంలో సీఎండీ డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, సీనియర్ డీఎంవో డాక్టర్ సునీల్ కుమార్, డీఎంవో డాక్టర్ వెంకమాంబ తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటి స్కామ్ జరిగినా పట్టదా!

● బ్యాంకు అధికారుల తీరుపై డ్వాక్రా సభ్యుల నిరసన
● వేళంగి ఎస్‌బీఐ బ్రాంచిని ముట్టడించిన మహిళలు, గ్రామస్థులు



వేళంగి స్టేట్ బ్యాంక్ ఎదుట ఆందోళన చేస్తున్న కూరాడ డ్వాక్రా సభ్యులు, గ్రామస్థులు

కరప, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కోటి రూపాయల స్కామ్ జరిగినా మిన్నకుండిపోయిన బ్యాంకు అధికారుల తీరును నిరసిస్తూ కాకినాడజిల్లా కరప మండలం కూరాడ గ్రామానికి చెందిన పలువురు బాధిత డ్వాక్రా సభ్యులు గురువారం వేళంగి స్టేట్‌బ్యాంక్‌ను ముట్టడించారు. ప్రధానద్వారం ఎదుట బైఠాయించి ఉద్యోగులను లోపలకు వెళ్లకుండా అడ్డుకున్నారు. కడుపు కట్టుకుని నెలవారీ రుణ వాయిదాలను చెల్లిస్తే బ్యాంకులో జమచేయకుండా నొక్కేసిన బీసీ పాయింట్ కరస్పాండెంట్ చిన్నం ప్రియభారతి, ఆమెకు సహకరించిన యానిమేటర్లపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక్కనెల వాయిదా కట్టకపోయినా ఉపేక్షించని బ్యాంకు అధికారులు ఏళ్ల తరబడి 85 సంఘాలకు చెందిన దాదాపు రూ.99లక్షలు పక్కదారి పట్టినా పట్టించుకోకపోవడంపై బాధితులు అనుమానం వ్యక్తం చేశారు. జరిగిన అవకతవకలు, అక్రమాల్లో వారి ప్రమేయం కూడా ఉందని ఆరోపించారు. పొదుపు సొమ్ములను వాయిదాలకు జమవేసుకోవడంపైనా బాధితులు తీవ్రంగా స్పందించారు. జిల్లా ఉన్నతాధికారులు, ఎస్‌బీఐ అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతవరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. బాధిత మహిళా సంఘాల సభ్యులకు సంఘీభావంగా గ్రామస్థులు కూడా బ్యాంకు ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు వచ్చి ఆందోళనకారులు, బ్యాంకు సిబ్బందితో చర్చించారు. బ్రాంచి మేనేజర్ వచ్చి తమకు స్పష్టమైన హామీ ఇస్తేనేగానీ కదిలేది లేదని బాధితులు భీష్మించుకుని కూర్చున్నారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో ఏబీఎం ఫల్గుణరావు బాధితులతో చర్చించారు. ఉన్నతాధికారులకు నివేదించి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించి ఆయనకు ఫిర్యాదు పత్రాలను అందించి అక్కడి నుంచి వెనుదిరిగారు. ఆందోళనలో ఎంపీటీసీ గుత్తుల శాంతిబాలాజీ, జేఏసీ నాయకుడు వెలుగుబంట్ల గంగాధర్, వైసీపీ నాయకుడు వెలుగుబంట్ల నారయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణం పోశారు..

● గోకవరం ప్రభుత్వాసుపత్రిలో ఘటన



గుండెపోటుకు గురైన వ్యక్తికి సీపీఆర్ చేస్తున్న వైద్యాధికారి రామలక్ష్మి

గోకవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గోకవరం ప్రభుత్వాసుపత్రిలో గురువారం ఓ అరుదైన సంఘటన చోటుచేసుకొంది. ప్రభుత్వాసుపత్రిలో ఈనెల 13వ తేదీ నుంచి 17వ తేదీ వరకు సీపీఆర్ అవగాహన కార్యక్రమం నిర్వహించాలంటూ ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలోభాగంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో సీపీఆర్‌పై పోస్టర్స్ ద్వారా ప్రజలకు ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారిణి రామలక్ష్మి, సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ఈక్రమంలో ఏజెన్సీ ప్రాంతంలోని పాతరామవరం గ్రామానికి చెందిన కె.వెంకట రమణ అనే వ్యక్తి పాము కాటుకు గురై, గుండె పోటురావడంతో ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లాడు. దీంతో కటుంబ సభ్యులు హూటాహూటినా స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసికొచ్చారు. ఇంతలో సీపీఆర్‌పై డెమో రూపంలో వివరిస్తున్న వైద్యాధికారిణి రామలక్ష్మికి విషయం తెలిసి వెంటనే బాధితుడువద్దకు పరుగులు తీశారు. వెంటనే వైద్యురాలు రామలక్ష్మి, వైద్య సిబ్బంది సుమారు 6 నుంచి 10నిమిషాలపాటు వెంకటరమణకు సీపీఆర్ చేసి ప్రాణాపాయస్థితి నుంచి అతనిని గట్టెక్కించారు. తరువాత కొద్దిసేపటికి బాధితుడికి వైద్య పరీక్షలు నిర్వహించగా అతని ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉన్నట్లు ఆమె గుర్తించారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగానే ఉందని, ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నట్లు సిబ్బంది తెలిపారు. గుండెపోటుకు గురైన వ్యక్తులను ఏ విధంగా రక్షించుకోవాలో తెలిపేందుకు ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీపీఆర్ కార్యక్రమం ఓ నిండు ప్రాణాన్ని కాపాడటంపట్ల వైద్యాధికారిణి రామలక్ష్మి, సిబ్బంది అభినందించారు.

రాఘవాపురంలో
గ్రావెల్ తవ్వకాలు

● పరిశీలించిన మైన్స్ అధికారులు
● సీజ్ చేసిన చైన్ మౌంటెడ్ యంత్రం



అక్రమ తవ్వకాలను పరిశీలించిన మైనింగ్ అధికారులు



మైనింగ్ అధికారులు సీజ్ చేసిన చైన్ మౌంటెడ్ యంత్రం

కోరుకొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ మండలం రాఘవాపురం గ్రామ పరిధిలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్న సమాచారంపై జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారులు ఆకస్మిక తనిఖీ చేసినట్లు జిల్లా మైన్స్అధికారి డి.ఫణి భూషణ్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తనిఖీ సమయంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు నిర్వహిస్తున్న గుంతలు, తవ్వకాలకు ఉపయోగించిన టాటా హిటాచి (చైన్ మౌంటెడ్ పాన్) యంత్రాన్ని గుర్తించారు. అక్కడ ఉన్న ఆపరేటర్ మురమల్ల ప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. సంబంధిత ప్రదేశానికి ఎటువంటి శాఖాపరమైన అనుమతులు లేవని నిర్ధారించడంతో, ఇది అక్రమ తవ్వకంగా గుర్తించారు. అనంతరం సర్వే నెం.44/2,44/3లోని ప్రాంతంలో తవ్వకాలు జరిగినట్లు గుర్తించి కొలతలు వేయగా, మొత్తం 19,300క్యూబిక్ మీటర్ల గ్రావెల్ అక్రమంగా తవ్వినట్లు తేలింది. ఆ భూమి వంక బరాజు వెంకట సర్వేశ్వరరావు, వంక వరలక్ష్మి, గునమూరి ఆనందలక్ష్మి, వంక సూర్య కుమారిలకు చెందిందని రాఘవాపురం గ్రా మ రెవెన్యూ అధికారులు తెలిపారు. అక్రమ తవ్వకాలకు ఉపయోగించిన టాటా హిటా చి యంత్రాన్ని స్థానిక రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో రాఘవాపురంలో భద్రపరిచారు. అనుమతి లేని ప్రాంతాలలో తవ్వకాలు నిర్వహిం చినట్లయితే సంబంధితులపై గనులు, భూగర్భశాఖచే కఠినచర్యలు తీసుకుంటా మని జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారి హెచ్చరించారు. కేవలం అనుమతి పొందిన గనులలోనే తవ్వకాలు, రవాణా నిర్వహించాల్సిందిగా సూచించారు.

బంగారు ఆభరణాలు స్వాధీనం



అమలాపురం పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

అమలాపురం టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అమలాపురం బస్టాండులో బస్సు ఎక్కుతున్న సమయంలో ఆభరణాలతో ఉన్న బ్యాగును పోగొట్టుకున్న మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ ఎన్ఆర్ కిశోర్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ నేతృత్వంలో క్రైమ్ సిబ్బంది సహకారంతో కేసును ఛేదించారు. పశ్చిమ గోదావరిజిల్లా భీమవరానికి చెందిన జడ్డు ముత్యవతి (61) అనే మహిళను అరెస్టుచేసి ఆమె వద్ద నుంచి 66.270 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ గురువారం వెల్లడించారు. ఇమ్మిడివరప్పాడుకి చెందిన వెలిగంటి లీలావతి ఈనెల 4వ తేదీన బస్సు ఎక్కేందుకు అమలాపురం డిపోకు రాగా బంగారు ఆభరణాలతో ఉన్న బ్యాగును పోగొట్టుకుంది. అందులో నల్లపూసల దండ, నక్లెస్‌తో పాటు వివిధ రకాల ఆభరణాలు ఉన్నాయి. దీంతో లీలావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

యువతి కిడ్నాప్ కేసులో ముగ్గురి అరెస్టు

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాకు చెందిన యువతి కిడ్నాప్ కేసులో ముగ్గురిని గొల్లప్రోలు పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను పిఠాపురం సీఐ జీ.శ్రీనివాస్ గురువారం రాత్రి వెల్లడించారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన ఓ యువతి కర్రి వంశీతోపాటు ఓ మైనర్‌ను ప్రేమించింది. దీనిపై వీరి మధ్య వివాదం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈనెల 11వ తేదీ ఉదయం 10 గంటల సమయంలో బాలుడు సదరు యువతిని స్కూటర్ ఎక్కించుకుని రాజానగరం బీచ్ వద్దకు తీసుకువెళ్లాడు. అక్కడ నుంచి మైనర్ బాలుడు, వంశీ, వంశీ స్నేహితుడు రాజు ఆమెను బలవంతంగా కారులో ఎక్కించుకుని అన్నవరం, కత్తిపూడి మీదుగా గొల్లప్రోలు మండలం చేబ్రోలు శివారులోని మట్టిరోడ్డులోకి తీసుకువెళ్లారు. కాగా, ఇద్దరిలో ఎవరో ఒకరిని తేల్చుకోవాలంటూ యువతిని వారు కొట్టి బెదిరించారు. అక్కడ చేబ్రోలుకి చెందిన వాడబోయిన సాంబశివ అలియాస్ సాంబ అనే వ్యక్తి యువతిని బెదిరించాడు. దీంతో యువతి ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం మైనర్ బాలుడు, కర్రి వంశీ, రాజును చేబ్రోలు కోకోపామ్ వద్ద గురువారం అరెస్టు చేశారు. నేరానికి ఉపయోగించిన కారును స్వాధీన పర్చుకున్నారు. మరో ముద్దాయి సాంబ పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

జడ్.మేడపాడులో రైల్వేగేటును ఢీకొట్టిన క్వారీ లారీ

మండపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండపేట మండలం జెడ్.మేపాడులో రైల్వేగేటును గురువారం ద్వారపూడి వైపు నుంచి వచ్చిన క్వారీ లారీ వేగంగా ఢీకొట్టింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దానివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సంఘటనపై రైల్వే అధికారులు లారీ యాజమానిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. గేటు మరమ్మతులు చేస్తే గానీ గేటు తెరుచుకోదని అధికారులు తెలిపారు.

తహశీల్దార్ ఇంట్లో ఏసీబీ అధికారుల సోదాలు

● ల్యాప్‌టాప్‌తో సహా కీలక డాక్యుమెంట్లు స్వాధీనం

అమలాపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అమలాపురం తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్ ఇంట్లో బుధవారం అర్థరాత్రి దాటే వరకు ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో గంధం దుర్గాకొండలరావు నుంచి భూమి సర్వే నిమిత్తం రూ.50 వేలు లంచం తీసుకుంటూ తహశీల్దార్‌తో పాటు డేటా ఎంట్రీ ఆపరేటర్ రాము ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఈ నేపథ్యంలో రెవెన్యూఉన్నతాధికారి ఒకరిని ఏసీబీ అధికారులు విచారించినట్టు సమాచారం. తహశీల్దార్ నివాసం ఉంటున్న అమలాపురం కామనగరువు రోడ్డులో ఉన్న ఆయన ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. సుమారు 25 మందికిపైగా ఏసీబీ అధికారులు బృందాల వారీగా విడిపోయి అమలాపురంలో బుధవారం మకాం వేసినట్టు తెలిపింది. కీలకమైన ల్యాప్‌టాప్‌తో పాటు ఇతర ఆధారాలు లభ్యం కావడమే కాకుండా ఆయన ఒక విలాసవంతమైన ఇల్లు నిర్మిస్తున్నట్టు గుర్తించారు. కాగా, తహశీల్దార్‌ను అక్రమంగా ఏసీబీ కేసులో ఇరికించారంటూ కొందరు సోషల్ మీడియా వేదికగా ప్రచారాలు చేస్తున్నట్టు సమాచారం. విచారణ అనంతరం గురువారం తెల్లవారుజామున తహశీల్దార్ అశోక్‌ప్రసాద్, డేటాఎంట్రీ ఆపరేటర్ రాములను ఏసీబీ కోర్టులో హాజరు పరిచేందుకు అధికారులు తరలించారు.

యువతి అదృశ్యంపై కేసు

పి.గన్నవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యంపై గురువారం పి.గన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం చల్లపల్లికి చెందిన ఓ యువతి ఈనెల 14న పి.గన్నవరం మండలంలోని ఒక గ్రామంలో ఉన్న తన అక్క ఇంటికి వచ్చింది. తన బావ ఊరు వెళ్లడంతో అక్కకు తోడుగా ఉండేందుకు వచ్చిన యువతి గురువారం ఉదయం నుంచి అదృశ్యమైంది. ఉదయం ఐదుగంటల సమయంలో చెల్లి లేకపోవడాన్ని గమనించిన అక్క బంధువులకు సమాచారం అందించింది. చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వాకబు చేసినా ఎంతకీ ఫలితం లేకపోవడంతో సదరు యువతి బంధువులు ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ బీ.శివకృష్ణ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేశారు.

ఆభరణాల చోరీపై కేసు నమోదు

పి.గన్నవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం హైస్కూల్ రోడ్డులో బంగారం, వెండి ఆభరణాలు అపహరణకు గురికావడంతో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి .... పి.గన్నవరం గ్రామానికి చెందిన ఏడిద వీరవెంకటలక్ష్మి కుటుంబం కొంతకాలంగా ఉపాధి నిమిత్తం హైదరాబాదులో కూరగాయలు షాపు నిర్వహించుకుంటున్నారు. హైస్కూల్ రోడ్డులో ఉన్న ఇంట్లో ఒక పోర్షన్‌ను అద్దెకు ఇవ్వగా, వారు నివసించే పోర్షన్‌కు తాళం వేసుకున్నారు. ఈక్రమంలో ఆగస్టు 24 వ తేదీన వీరవెంకటలక్ష్మి కుటుంబం పెళ్లి నిమిత్తం స్వగ్రామానికి వచ్చి తిరిగి పయనమయ్యారు. కాగా, ఈనెల 9వ తేదీన ఇంటి తాళాలు పగలుగొట్టి ఉండటాన్ని గమనించిన స్థానికులు వారికి సమాచారం అందించారు. దీంతో హైదరాబాద్ నుంచి వచ్చి ఇంటిని పరిశీలించగా 16 గ్రాముల బంగారం ఆభరణాలు, 15 తులాలు వెండి ఆభరణాలు అపహరణకు గురైనట్టు గుర్తించారు. దీంతో వీరవెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు.

తండ్రీ, కొడుకుల
ఆత్మహత్మ కేసులో ముగ్గురిపై కేసు

ఆలమూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం మడికి శివారు చిలకలపాడులో బుధవారం జరిగిన ఆత్మహత్యలకు సంబంధించి ముగ్గురిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. పావులూరి కామరాజు తన కుమారులైన అభిరామ్, గౌతమ్‌ను హతమార్చి తాను కూడా ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే.దీంతో చిలకలపాడుకు చెందిన పాలువూరి దుర్గారావు, కొలప్రోలు తలుపులు, కొలప్రోలు శ్రీనివాస్ వేధింపులు భరించలేకే తాను తన కుమారులు చనిపోతున్నట్టు ఆత్మహత్యకు ముందు కామరాజు సెల్ఫీ వీడియో తీశాడు. ఈ మేరకు వారి ముగ్గురిపై 306 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్టు ఆలమూరు ఎస్ఐ జీ.నరేష్ తెలిపారు.

పోస్టుమార్టం పూర్తి..

గురువారం మూడు మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తిచేశారు. అనంతరం బంధువులకు అప్పగించారు. బుధవారం సాయంత్రానికి ఎఫ్ఎస్ఎల్ టీమ్‌లు రావడం ఆలస్యమైంది.

లారీ ఢీకొని ఒకరి మృతి

● మండపేట మండలం జెడ్.మేడపాడు వద్ద ప్రమాదం



మృతిచెందిన వెంకటేష్

మండపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండపేట మండలం జెడ్.మేడపాడు వద్ద గురువారం జరిగిన రోడ్డుప్రమాదంలో మోటారు సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తి లారీని తప్పించబోయి ఎదురుగా వస్తున్న మరో లారీ ఢీకొట్టడంతో మృతిచెందాడు. మండపేట రూరల్ పోలీసుల కథనం ప్రకారం ఇప్పనపాడుకు చెందిన సిద్దాంతపు వెంకటేష్ (35)గా గుర్తించారు. మృతుడుకి భార్య, కుమారుడు వున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మండపేట రూరల్ ట్రైని ఎస్ఐ సోమేంద్ర తెలిపారు.

తాండవ నదిలో స్నానానికి దిగి ..



నీటిలో తేలియాడుతున్న పెద్దింట్ల మృతదేహం

కోటనందూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తాండవ నదిలో స్నానానికి దిగి వ్యక్తి మృతిచెందాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అల్లిపూడి గ్రామానికి చెందిన వడ్లమూరి పెద్దింట్ల అనే శ్రీను కూలీ పని చేసుకుని జీవిస్తున్నారు. బుధవారం యథావిధిగా పని నుంచి ఇంటికి వచ్చే సమయంలో తాండవ నదిలో స్నానానికి దిగి కనిపించలేదు. దీంతో కుటుంబ సభ్యులు, స్థానికులు, పోలీసులు, ఫైర్ సిబ్బంది ఎంత వెతికినా కనిపించలేదు. గురువారం ఉదయం నదిలో శవమై కనిపించాడు. భార్య సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతుడిని పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

నేడు బాణసంచా పేలుడు ప్రదేశానికి విచారణ బృందం రాక

మండపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 8న రాయవరంలో జరిగిన బాణసంచాపేలుడు సంఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విచారణ అధికారులు బృందం శుక్రవారం ఆప్రదేశానికి రానుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు విచారణ అధికారులుగా మున్సిపల్‌శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి సురేష‌కుమార్, ఈగల్ ఐజీ ఆర్.హరికృష్ణను నియమించారు. ఈ బృందం వచ్చిన తర్వాత విచారణ జరిపి తమ నివేదికను రాష్ట్రప్రభుత్వానికి సమర్పించనుంది.కాగా, మృతిచెందిన వారంతా రెక్కాడితే గానీ డొక్కాడనివారే నని, వారికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందజేసి మృతులకుటుంబాలను ఆదుకోవాలని మృతుల కుటుంబాలకు చెందినవారితో పాటు ప్రజాసంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

● సూర్యారావుపేటలో ఘటన

రాజానగరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): భార్య, భర్త మధ్య తలెత్తిన వివాదం కారణంగా వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. రాజానగరం గ్రామ పంచాయతీ పరిధి సూర్యారావుపేటకు చెందిన నాగరాజు శ్రీజ్యోతి (25) అనే వివాహిత, భర్త కృష్ణ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శ్రీజ్యోతి తల్లి దుబాయ్‌లో ఉంటూ అప్పుడప్పుడు కూతురికి కొంత డబ్బులు పంపిస్తుంటుంది. వీటిని మృతురాలి భర్త వృథాగా ఖర్చు చేస్తుంటాడు. ఈ విషయమై భార్యభర్త మధ్య మాటామాటా పెరిగి గొడవలు పడ్డారు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన శ్రీజ్యోతి గురువారం చీరతో ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి ఏడాదిన్నర, ఎనిమిది నెలలు వయసు కలిగిన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు రాజానగరం పోలీసులు కేసు నమోదు చేశారు.

రైళ్లలో దీపావళి సామగ్రి రవాణా చేస్తే జైలు

● దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక ఉత్తర్వులు జారీ

సామర్లకోట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దీపావళి నేపథ్యంలో రైళ్లలో నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా సామగ్రి రవాణా చేసే వ్యక్తులపై కఠినచర్యలు తీసుకోవాలని రైల్వేశాఖ ఆదేశాలు జారీ చేసింది. కాకినాడ జిల్లాలోని సామర్లకోట రైల్వేస్టేషన్ పరిధిలో బాణసంచా తయారీ సంస్థలు అధికంగా ఉన్నాయి. ఈ ప్రాంతం నుంచి అనధికారికంగా బాణసంచా సామాగ్రిని వివిధప్రాంతాలకు రవాణా చేస్తున్నారనే ఆరోపణలు అనేకం ఉన్నాయి. దీంతో దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. బాణసంచా, పేలుడు పదార్థాలను రైళ్లలో తీసుకెళ్లకుండా చూడాలని సామర్లకోట రైల్వే అధికారులను హెచ్చరించింది. ఒకవేళ ప్రయాణికులు బాణసంచాతో పట్టుబడితే రూ. వెయ్యి జరిమానా (లేదా) మూడునెలల జైలు విధిస్తామని రైల్వే ఉన్నతాధికారులు జారీ చేసిన ఆదేశాల్లో పేర్కొన్నారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com



జెండా ఊపి జీఎస్టీ అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్, చిత్రంలో జిల్లా రవాణా అధికారి సురేష్

ప్రజల ఆనందం కోసమే పన్నుల తగ్గింపు

• జీఎస్టీ అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ

రాజమహేంద్రవరంఅర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలంతా ఆదాయం కోల్పోతున్నా ప్రజలు ఆనందంగా ఉండాలనే ఆశయంతో జీఎస్టీ శ్లాబులు తగ్గించడం జరిగిందని, ఇది ఒక చరిత్రాత్మకమైన నిర్ణయం అని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల నుంచి లాలాచెరువు జంక్షన్ వరకూ సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ జెండా ఊపి ఈ ర్యాలీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటువంటి పన్నుల తగ్గింపు కార్యక్రమాలు భవిష్యత్తులో ఏ ప్రభుత్వంలోనూ చూడలేమని, ఒక్క కూటమి ప్రభుత్వం వల్లనే ఇది సాధ్యమని ఆయన పేర్కొన్నారు. జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ మాట్లాడుతూ పన్నులు తగ్గించడం వల్ల రవాణారంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నవారికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. పాంపెట్లు, పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్, ఎంవీఐలు చింత సంపత్‌కుమార్, ఎం.రవికుమార్, ఏఎంవీఐలు పీవీపీడీ సాయికుమార్, జి.ప్రణీత్‌కుమార్, సిబ్బంది, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

తగ్గింపుతో సామాన్యులకు ప్రయోజనం

• ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

రాజానగరం(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో సామాన్య కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలో రవాణాశాఖ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ ఏర్పాటు చేసిన ఆటో, వాహన ర్యాలీలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి దుకాణానికి వెళ్లి జీఎస్టీ తగ్గింపుపై వినియోగదారులకు వివరించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, కేంద్రంలో ప్రధాని మోదీ ఒకవిజన్‌తో సుపరిపాలన అందిస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో రవాణా శాఖాధికారి ఉమామహేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

రవాణా రంగానికి మేలు: మనోజ్‌రెడ్డి

అనపర్తి(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌లో భాగంగా రవాణా రంగానికి చేకూరే మేలును ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేయాలని అనపర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి అన్నారు. గురువారం అనపర్తిలోని దేవీ చౌక్ వద్ద ప్రచార కార్యక్రమంలో భాగంగా మనోజ్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, రవాణాశాఖ అధికారుల ఆధ్వర్యంలో జీఎస్టీతో చేకూరే మేలును వివరిస్తూ ముద్రించిన స్టిక్కర్లను ఆటోలకు అతికించారు. ఈ సందర్భంగా రవాణా కార్మికులు, వ్యాపారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం వర్తక సంఘ కళ్యాణ మండపంలో జరిగిన జీఎస్టీ అవగాహన సదస్సులో మనోజ్‌రెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో క్యాన్సర్ మందులపై జీఎస్టీని సరళీకృతం చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్‌ఇన్‌స్పెక్టర్ రాజేశ్, ఏఎంసీ చైర్‌పర్సన్ జుత్తుగ సూర్యకుమారి, జనసేన నాయకుడు రాచాడ నాగు, జుత్తుక కృష్ణ, వర్తక సంఘం అధ్యక్షుడు కొవ్వూరి వెంకటరామారెడ్డి, టీడీపీ నాయకుడు కర్రి వెంకటరామారెడ్డి, వర్తకులు పాల్గొన్నారు.

జీఎస్టీ



రాజానగరంలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్ ర్యాలీలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



అనపర్తిలో ఆటోలకు స్టిక్కర్లు అతికిస్తున్న దృశ్యం

పీసీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు



రిఫరల్ ఆసుపత్రుల నిబంధనల

ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలి

• పీసీఎండీకి రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ నాయకుల వినతి

రాజమహేంద్రవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రైల్వే హెల్త్ యూనిట్‌లోని వైద్య సదుపాయాల్లోని సమస్యలను పరిష్కరించాలని, రిఫరల్ ఆస్పత్రుల నిబంధనల ఉల్లంఘనలపై చర్యలుతీసుకోవాలని కోరుతూ దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిర్మల రాజారామ్‌కి దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు వినతిపత్రాన్ని సమర్పించారు. గురువారం రాజమండ్రి వచ్చిన ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను విన్నవించారు. రిఫరల్ ఆస్పత్రులు రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబీకుల నుంచి డబ్బులు వసూలు చేయకూడదనే నిబంధనలను ఉల్లంఘిస్తున్నా యన్నారు. రోగుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ బిల్లులు కూడా ఇవ్వడం లేదన్నారు. రిఫరల్ ఆస్పత్రుల వైద్యం కోసం విజయవాడ, కాకినాడకు వెళ్లడం ఇబ్బందిగా ఉందన్నారు. గతంలో మాదిరిగా రాజమం డ్రి హెల్త్ యూనిట్‌కి స్పెషలిస్టు డాక్టర్లు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. రాజమండ్రి డిపో పరిధిలో 2500మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ సదుపాయం లేకపోవడం చాలా సమస్యగా ఉందన్నారు. ఎక్స్‌రే సదుపాయంతోపాటు రేడియా లజిస్టును కూడా నియమించాలని కోరారు. అవసరమైన మందులు నిరంతరాయంగా అందుబాటులో ఉండడంకోసం లోకల్ కొనుగోలు పరిమితిని పెంచా ల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో లోకో రన్నింగ్, ఓపెన్ లైన్, మెక్ అండ్ ట్రైన్ మేనేజర్ బ్రాంచీల కార్యదర్శులు మల్లికార్జునరావు, సుంకర చంద్రమౌళి, త్రినాథ్ వంగపండు, నాయకులు టి.నాగేంద్ర, జె.ప్రకాశ్, సతీశ్‌బాబు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అర్బన్‌లో 141, రూరల్‌లో 116

తాత్కాలిక లైసెన్సులు జారీ

• ఆర్డీవో కృష్ణనాయక్

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని రాజమహేంద్రవరం అర్బన్‌లో 141, రూరల్ పరిధిలో 116 దీపావళి షాపులు ఏర్పాటుకు తాత్కాలిక లైసెన్సులు జారీ చేసినట్టు రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ తెలిపారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఆర్ట్స్ కళాశాల, సుబ్రహ్మణ్యమైదానం, క్వారీ మార్కెట్, వీఎల్ పురం జంక్షన్ పరిధిలోను, రూరల్ ప్రాంతాల్లోనూ షాపులు ఏర్పాటుకు అనుమతి ఇవ్వడమే అయిందని ఆయన తెలిపారు. లైసెన్సు పొందిన ప్రతి వారు తప్పనిసరిగా భద్రతా చర్యలను అమలుచేయాలని, ప్రతి షాపు వద్ద అగ్నిమాపక యంత్రాన్ని సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రతి ప్రాంగణంలో పై కెమికల్ పౌడర్, నాలుగు ఇసుక బస్తాలు, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించేందుకు తగిన నీరు తప్పనిసరిగా ఉంచాలని తెలిపారు. 18 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న పిల్లలను షాపుల్లో పెట్టరాదని, నో స్మోకింగ్ బోర్డులు కనిపించేలా తప్పనిసరిగా ఏర్పాటుచేయాలని ఆయన పేర్కొన్నారు.

దీపావళి సామగ్రి విక్రయాలకు లైసెన్స్ తప్పనిసరి

• గోకవరం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ శ్రీకాంత్

గోకవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రానున్న దీపావళి పండుగను పురస్కరించుకొని బాణసంచా సామగ్రిని విక్రయించే వ్యాపారులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగిఉండాలని రాజమహేంద్రవరం అర్బన్‌జిల్లా నార్త్‌జోన్ డీఎస్పీ వైశ్రీకాంత్ అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా గోకవరం పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా డీఎస్పీ శ్రీకాంత్ స్టేషన్ రికార్డులను పరిశీలించిన అనంతరం, సిబ్బంది వివరాలను ఎస్ఐ పవన్‌కుమార్ నుంచి అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ వెంట సీఐ వైసత్యకిషోర్ ఉన్నారు.

మెడికల్ కళాశాలల వ్యయం అభివృద్ధిగా భావించాలి

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కళాశాలపై చేసే ఖర్చును పెట్టుబడిగా కాకుండా అభివృద్ధిగా భావించాలని ప్రజా ఆరోగ్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణయ్య అన్నారు. గురువారం రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ-ప్రభావం అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. పీపీపీ విధానంలో మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య విద్య దూరమవుతుందని అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వై.కాశీరావు, ఎస్.రాజా పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో గురువారం విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ రామచంద్ర ఆర్‌కే ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాణాలను కాపాడడంలో సీపీఆర్ సాంకేతికత అత్యంత ప్రాముఖ్యత కలిగి ఉంటుందని అన్నారు. యూత్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో గణితశాస్త్ర విభాగం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ పాట్రన్ కుంచె రమణ, రెడ్‌క్రాస్ జిల్లా కో ఆర్డినేటర్ వి.రాంబాబు, మ్యాథ్స్ విభాగాధిపతి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

19న ఎంపీ పురందేశ్వరి పాల్గొనే కార్యక్రమాలివే

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) :రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఈనెల 19వ తేదీ ఆదివారం కాకినాడ, రాజానగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉదయం 9 గంటలకు కాకినాడ దంటు కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాల్గొనే లక్ష్మీ ప్రసన్న అభినందన సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ దగ్గర ఆడిటోరియంలో ఆరోఎస్ఎస్ శతాబ్ది, వివిధ క్షేత్రాల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొంటారు. బీజేపీ మండల అధ్యక్షులు, అసెంబ్లీ కన్వీనర్లు, జిల్లా పదాధికారులు, రాష్ట్ర బాధ్యతలు కల్గినవారు పాల్గొనాలని ఎంపీ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

యోగా థీమ్ పార్కు ప్రారంభం

• పాల్గొన్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి, ఎమ్మెల్సీ సోము

రాజమహేంద్రవరంసిటీ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం 10వ డివిజన్‌లో రూ.50లక్షలతో ఆధునీకరించిన యోగామ్ ఆధునీకరించిన యోగానందస్వామి పార్కును ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ప్రారంభించారు. గురువారం రాత్రి జరిగిన ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కినాగేంద్ర, జనసేన సిటీ ఇంచార్జి అనుశ్రీ సత్యనారాయణ, నగర అధ్యక్షుడు వై.శ్రీను, జామి సత్యనారాయణ బీజేపీ నాయకులు బొమ్ముల దత్తుతో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించి పార్కును ప్రారంభించారు. ఈసందర్భంగా ఆదిరెడ్డివాసు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నగర జనం ఇబ్బందులకి తీ సుకెళ్ళే అన్ని ప్రాంతాలకూ ఆహ్లాదాన్ని కల్పిస్తున్నామన్నారు. యోగానంద పార్కులో పతంజలి విగ్రహాన్ని ప్రతిష్ఠించామని, పతంజలి ధ్యానమందిరంగా తీర్చిదిద్దామని, ఆదేవిధంగా వెల్‌నెస్ ట్రాక్ ఏర్పాటు చేశామన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ ఆయుర్వేద మొక్కలు, పతంజలి విగ్రహం ఏర్పాటు చేస్తూ యోగా పార్కు అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు.



యోగా పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఎమ్మెల్సీ సోము, కమిషనర్ రాహుల్ మీనా

పరిశుభ్రమైన ఆహారంతోనే ఆరోగ్యం

• డీసీపీసీ సభ్యుడు గొట్టిముక్కల

రాజమహేంద్రవరంసిటీ, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రమైన ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం మన సొంతమవుతుందని జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు అన్నారు. గురువారం రాజమహేంద్రవరం నన్నయ్య మున్సిపల్ స్కూల్‌లో కన్స్యూమర్స్ వాయిస్ ఆధ్వర్యంలో జరిగిన వరల్డ్‌ఫుడ్ డే కార్యక్రమానికి డీసీ పీసీ సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి విజిలెన్స్ కమిటీ సభ్యుడు దర్నాలకోట వెంకటేశ్వరరావు ఆ ధ్యక్షత వహించారు. ఈసందర్భంగా అనంతరావు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు నాణ్యమైన పరిశుభ్రమైన ఆహారాన్ని అందించేందుకు విశేషకృషి చేస్తున్నాయన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ రోడ్డుపై లేదా రెస్టారెంట్లలో ఇస్తున్న ఆహారం నాణ్యత ఎంత ఉందో తప్పనిసరిగా పరిశీలించి ఆహారాన్ని తీసుకోవాలన్నారు. దర్నాలకోట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆహార భద్రత విషయంలో హోటల్స్, రెస్టారెంట్ల నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు. సమావేశంలో పాఠశాల హెచ్ఎం (ఇంచార్జి)వి.దుర్గ, ఉపాధ్యాయులు సీహెచ్ శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌డేని సద్వినియోగం చేసుకోండి: విల్సన్‌పాల్

కడియం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రతినెలా 3వ శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అన్నిశాఖల జిల్లా అధికారుల సమక్షంలో గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జిల్లా ఉద్యోగుల సంఘ జిల్లా కార్యదర్శి సీహెచ్ విల్సన్‌పాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 17న శుక్రవారం సాయంత్రం 4 గంటలకు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ హాల్‌లో ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం నిమిత్తం గ్రీవెన్స్‌డే జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విల్సన్‌పాల్ పిలుపునిచ్చారు.

ఘనంగా శ్రీ మహబూబ్ సుభాని గంధోత్సవం

గోకవరం, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): గోకవరంలోని పాతబస్టాండ్ సమీపంలో గల మహబూబ్ సుభానిదర్గావద్ద 46వ గంధోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా దర్గా నిర్వాహకులు బాబు, జహన్ దంపతుల ఆధ్వర్యంలో పవిత్ర గంధాన్ని శిరస్సున ధరించి పాతబస్టాండ్ నుంచి విద్యుత్ కా ర్యాలయం సమీపంలో ఉన్న దర్గా వరకు బాణసంచాకాల్పులతో, పకీరుల మేళ తాళాలతో ఊరేగింపుగా వెళ్లి అక్కడ ఉన్న శ్రీ మహబూబ్ సుభాని వారికి సమర్పించారు. కులమతాలకు అతీతంగా భక్తులు దర్గాలో ఉన్న మహబూబ్ సుభాని వారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజానగరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : వార్షిక మరమ్మతు పనుల్లో భాగంగా నందరాడ విద్యుత్ సబ్‌స్టేషన్ 33/11 కేవీ నుంచి సరఫరా అయ్యే అన్ని 11 కేవీ ఫీడర్లకు ఈనెల 18న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేబీవీ నటరాజన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నందరాడ, నరేంద్రపురం గ్రామాలకు ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వ్యవసాయ విద్యుత్ తెల్లవారు ఝామున 4 గంటల నుంచి సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులంతా సహకరించాలని కోరారు.

'బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి'

గోకవరం, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి ప్రతీఒక్కరూ కృషిచేయాలని విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సీఎండీ లేఅవుట్ ప్రాంగణంలో గురువారం సాయంత్రం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బీజేపీ, రామసేన నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జగ్గంపేట, రంపచోడవరం, రాజానగరం నియోజకవర్గాల నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీని ఆదర్శంగా తీసుకొని తాను రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

హింసలేని సమాజమే ధ్యేయం

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలు, పిల్లలపై వేధింపులు లైంగిక దాడులులేని సమాజమే ధ్యేయంగా భూమిక ఉమెన్స్ కలెక్టివ్ సంస్థ రాజమండ్రిలో పనిచేస్తుందని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తెలిపారు. గురువారం రాజమహేంద్రవరం శ్రీకన్యాగార్డెన్ లో జరిగిన భూమిక ఉమెన్స్ కలెక్టివ్ కన్సల్టేషన్ సమావేశంలో భూమిక సంస్థ కోఆర్డినేటర్ అనుపమ, నిడమర్తి చైల్డ్‌రైట్స్ ప్రతినిధి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్, పోలీస్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధులు, ఎండీ అమీర్ పాషా, జేరాంబాబు, పారా డైరెక్టర్ సింహాచలం మాట్లాడారు. మహిళల హక్కులను కాపాడుతూ సామాజిక సమస్యల పరిష్కారానికై సమాజంలో సామాజిక మార్పుకై భూమిక కలెక్టివ్ సంస్థ చేస్తున్న సేవలపై చర్చించారు. ఈ సమావేశంలో అప్పయ్యమ్మ, శ్రీదేవి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

దివాన్‌చెరువు, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ స్టేట్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ సత్యనారాయణరెడ్డి, అసోసియేట్ కార్యదర్శి పి.బి వ్యాఘ్రరెడ్డి కోరారు. ఈమేరకు ఆయనను కలసి సమస్యలను వివరించారు. గురువారం విలేకరులకు తెలిపారు. పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటుచేసి ఐ.ఆర్ ప్రకటించాలని, ఉపాధ్యాయులపై బోధనేతర పనిభారం తగ్గించి కేవలం విద్యాబోధనకు మాత్రమే పరిమితం చేయాలని కోరామన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

• రైల్వే అసిస్టెంట్ డివిజనల్ మెటీరియల్ మేనేజర్ ఫణికుమార్

అనపర్తి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడమే ధ్యేయంగా స్టేషన్ల అభివృద్ధి జరుగుతుందని దక్షిణ మధ్య రైల్వే విజయవాడ అసిస్టెంట్ డివిజనల్ మెటీరియల్ మేనేజర్ జె.ఫణికుమార్ అన్నారు. అనపర్తిలో రూ.31కోట్లతో జరుగుతున్న స్టేషన్ అభివృద్ధి పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ మొత్తంలో జరుగుతున్న స్టేషన్ అభివృద్ధి పనిని పరిశీలించిన ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన ప్రయాణికుల తోను, ప్రయాణి కుల సంఘం ప్రతినిధులతోను మాట్లాడారు. అనపర్తిలో జన్మభూమి, హౌరా, గౌతమి, జెన్మభూమి హాల్ట్ కల్పించాలని పలువురు కోరారు. మూతపడిన రైల్వే గేటు వద్ద పుట్‌పాత్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని కోరారు. రాత్రి సమయంలో ప్లాట్‌ఫామ్‌పై ఆకతాయిల ఆగడాలు పెరిగిపోయాయని వీటిని నివారించాలని పలువురు కోరారు. కార్యక్రమంలో సిహెచ్ బాలశేఖర్, కళ్యాణ్, సత్యనారాయణ తదితర అధికారులు పాల్గొన్నారు.



ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంటున్న మేనేజర్ ఫణికుమార్

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి

• జడ్పీ డిప్యూటీ సీఈవో రామ్‌గోపాల్

రాజానగరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా డిప్యూటీ సీఈవో జి.శ్రీరామ్‌గోపాల్ అధికారులకు ఆదేశించారు. ఇంటింటా చెత్తసేకరణ కార్యక్రమంలో భాగంగా రాజానగరం మండలం రాధేయపాలెంలో గురువారం ఆయన గ్రామంలో పర్యటించారు. ఈసందర్భంగా పారిశుధ్య నిర్వహణ పనులతీరు గురించి గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని చెరువుగట్టు వెంబడి పేరుకుపో యిన వ్యర్థాలతో కూడిన చెత్త కుప్పలను పరిశీలించి, వాటిని తక్షణమే తొలగించాలని పంచాయతీ అధికా రులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో జేవీ రూసీ, సిబ్బంది ఉన్నారు.



చెత్తకుప్పలను పరిశీలిస్తున్న సీఈవో రామ్‌గోపాల్

జీజీయూలో వైభవంగా కళాక్రాంతి స్టార్టప్ మేళా



జీజీయూలో కళా క్రాంతి స్టార్టప్ మేళాను ప్రారంభిస్తున్న ఉపకులపతి చంద్రశేఖర్

రాజానగరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయూ)గోదావరి ఇన్వేషన్ గ్యారేజ్ ఆధ్వర్యంలో గురువారం కళాక్రాంతి స్టార్టప్ మేళా ఉత్సాహభరితంగా ప్రారంభమైంది. నిత్యజీవితంలో తరగతి గదులలో పరిమితమయ్యే విద్యార్థుల ఈమేళా ద్వారా సృజనాత్మకతను ప్రతిబింబించేలా తినుబండారాలు, సేంద్రియ కూరగాయలు, బొమ్మల దుకాణాలు వంటి పలు రకాలైన స్టాల్స్‌ను ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా జీజీయూ డైరెక్టర్ మురళీధరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచనా సామర్థ్యం, వ్యాపార దృక్పథాన్ని అభివృద్ధి చేయడానికి ఈవేదిక ఉపయోగపడుతుందన్నారు. ఉపకుల పతి య.చం ద్రశేఖర్ మేళాను ప్రారంభించి, స్టాళ్లను సందర్శించారు. ఈకార్యక మంలో రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, డీన్ కెవల్లీమాధవి, మెకానికల్ విభాగం అధ్యాపకులు నిర్మలాదేవి పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి చరిత్ర సృష్టించిన చంద్రబాబు, లోకేష్

• టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ



రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఐటీ దిగ్గజం మైక్రోసాఫ్ట్, తదుపరి గూగుల్ ఉన్నతంగా రాష్ట్రాభివృద్ధికి చరిత్ర సృష్టించిన సీఎం చంద్రబాబు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లు నిలిచారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ అన్నారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. గూగుల్ సంస్థ విశాఖపట్నం రావడానికి వారు చేసిన కృషిని ప్రశంసించారు. రాష్ట్రాన్ని సాంకేతికంగా అభివృద్ధి చెందడానికి గూగుల్ సంస్థ దోహద పడుతుందన్నారు.

కనువిందు చేస్తున్న ఓంకారం, వేలాయుధం



ఆలయ గాలిగోపురంపై ఏర్పాటు చేసిన శ్రీఓంకారం, వేలాయుధం

బిక్కవోలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బిక్కవోలులోని ప్రాచీన గోలింగేశ్వరస్వామి ఆలయ గాలిగోపురంపై ఏర్పాటుచేసిన ఓంకారం, వేలాయుధం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దీనిని గ్రామానికి చెందిన దాగంటి సుబ్బారెడ్డి అనే భక్తుడు ఆలయానికి బహూకరించారు. వేద మంత్రోచ్ఛారణల నడుమ దీనిని ఏర్పాటు చేశారు. పగలు, రాత్రి ఈ ఓంకారం, వేలాయుధం భక్తులను కనువిందు చేస్తోంది.

శివరామ డిజిటల్‌కు నేషనల్ అవార్డు



అవార్డును అందుకుంటున్న అవినాష్, ఈలి సతీష్, బొమ్మిరెడ్డి నాని

రాజమహేంద్రవరంసిటీ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రింటోనిక శివరామడిజిటల్ కలర్ ల్యాబ్‌కు ప్రతిష్ఠాత్మకమైన ప్రింట్ వీక్ ఇండియా 2025 నేషనల్ అవార్డు లభించింది. ఈ అవార్డును ముంబైలో శివరామకలర్ ల్యాబ్ డైరెక్టర్ పులపర్తి అవినాష్, కంపెనీ టెక్నికల్ హెడ్ ఈలి సతీష్, ప్రింటింగ్ హెడ్ బొమ్మిరెడ్డి నానిలు అందుకున్నారు. దేశంలో ప్రముఖ ప్రింటింగ్ కంపెనీలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో టెక్నాలజీ, ఇన్నోవేషన్స్, ప్రజంటేషన్, క్వాలిటీ స్టాండర్డ్ ఆధారంగా చేసుకుని డిజిటల్ ఫోటో ఆల్బమ్ ప్రింటర్ ఆఫ్ ది ఇయర్ నేషనల్ అవార్డుకు ప్రింటోనికా సంస్థను ఎంపిక చేశారు. ఈ అవార్డును ప్రింట్‌వీక్ ఇండియా సొల్యూషన్స్ బిజినెస్ హెడ్ కార్తీక్ షా, ఆర్ఎస్ సంజీవ్‌లు సంస్థ ప్రతినిధులు అందుకున్నట్టు ప్రింటోనిక శివరామకలర్ ల్యాబ్ డైరెక్టర్ ఎస్. గోకుల అరుణ్ తెలిపారు.

'అన్నార్తుల ఆకలి తీర్చాలి'

రాజమహేంద్రవరంసిటీ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చేందుకు అందరూ సహకరించాలని అన్నా మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత ఇసుకపట్ల ఇమ్మానుయేలు, స్వర్గంధ్ర నిర్వాహకుడు గుబ్బల రాంబాబులు పిలుపునిచ్చారు. స్థానిక పుష్కరాలరేవు వద్ద ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్నదానం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ వేడుకలలో, ఇళ్లలో,హోటళ్లలో పెద్దఎత్తున మిగులు ఆహార పదార్థాలు వృథా అవుతున్నాయన్నారు. స్వర్గాంధ్ర సేవా సంస్థ అన్నార్తులకు ఆకలి తీర్చేందుకు మొబైల్ ఫుడ్ సర్వీస్ ద్వారా గత ఆరు సంవత్సరాలుగా చేస్తున్న కృషిని గుర్తుచేశారు.



ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

శుక్రవారం 17 అక్టోబరు 2025 | 3



రాజాధిరాజ అలంకరణలో శ్రీవారు



చీరమేను సందడి

- యానాం మార్కెట్‌లో శేరు రూ.1500కు లభ్యం
- ధర చౌక అంటూ తరలివచ్చిన కొనుగోలుదారులు
- మత్స్యకారులకు కాసుల వర్షం

6

రాజాధిరాజా..

- రాజాధిరాజ అలంకరణలో గజవాహనంపై శ్రీవారి విహారం
- ఘనంగా లక్షతులసీ పూజా మహోత్సవం
- స్వామివారికి తిరుప్పావడ సేవ..
- బ్రహ్మోత్సవాల్లో వైభవంగా ఏడో రోజు

5



'తెలుగు' వెలుగు



- బొమ్మూరులో ఎట్టకేలకు పూర్తిస్థాయి తెలుగు విశ్వవిద్యాలయం
- ఇన్‌చార్జి వీసీగా ఆచార్య డి.మునిరత్నంనాయుడు
- వర్సిటీ అభివృద్ధికి నిధుల విడుదలకూ ప్రతిపాదనలు
- 1986 ఏప్రిల్‌లో తెలుగు సాహిత్య పీఠానికి ఎన్టీఆర్ శంకుస్థాపన
- రాష్ట్ర విభజన తర్వాత ఇన్నాళ్లకు విశ్వవిద్యాలయం ఏర్పాటు
- తెలుగుభాషకు, సాహిత్యానికి ఇక పూర్వవైభవం



మునిరత్నంనాయుడు



బొమ్మూరులోని విశ్వవిద్యాలయ పీఠం

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

ఇది ఎన్నో ఏళ్ల నాటి కల... ఇన్నాళ్లకు కార్యరూపం దాల్చింది. రాజమహేంద్రవరంలో తెలుగు విశ్వవిద్యాలయం పూర్తిస్థాయిలో రూపుదిద్దుకోబోతోంది. ఇప్పటివరకు బొమ్మూరులో తెలుగు విశ్వవిద్యాలయ పీఠం ఉంది. రాష్ట్ర విభజన తర్వాత ఇది పూర్తిస్థాయి యూనివర్సిటీగా మారుతుందని అందరూ ఆశించారు. అందుకు కొన్ని ప్రయత్నాలు జరిగాయి. గత ప్రభుత్వ హయాంలో దీన్ని పట్టించుకున్నది లేదు. ఎట్టకేలకు గత జూన్ నెలలో ఈ పీఠాన్ని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంగా రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపి నోటిఫికేషన్ ఇచ్చింది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఈ యూనివర్సిటీకి ఇన్‌చార్జి వీసీగా ప్రాచీన తెలుగు కేంద్రం మాజీ ప్రాజెక్టు డైరెక్టర్ డి.మునిరత్నంనాయుడుని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఈ విశ్వవిద్యాలయంలో కదలిక వచ్చినట్టయింది. ఆయన బాధ్యతలు తీసుకున్న తర్వాత రిజిస్ట్రార్‌ను నియమిస్తారు. తర్వాత తెలుగు విశ్వవిద్యాలయం పరిపాలన మొదలవుతుంది. వాస్తవానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటైన తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లో ఉండేది. దానికి అనుబంధంగా మన రాష్ట్రంలో రాజమహేంద్రవరం, శ్రీశైలం, కూచిపూడిలో పీఠాలు ఏర్పాటయ్యాయి. గత ఏడాది జూన్ నాటికి రాష్ట్ర విభజన జరిగి పదేళ్ల పూర్తికావడం, విభజన చట్టం ప్రకారం హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయంతో అనుబంధ సేవలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయాన్ని కేబినెట్ ఆమోదించినా వీసీ లేకపోవడంతో 2024-25 అడ్మిషన్లు జరగలేదు. సాధారణంగా జూన్‌లో నోటిఫికేషన్ ఇచ్చి ఆగస్టులో తరగతులు మొదలుపెట్టాలి. మరి ఈ విద్యా సంవత్సరాన్ని ఎలా మొదలెడతారో చూడాలి.

● రాష్ట్ర విభజన తర్వాత..

2014లో ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయిన తర్వాత ఏపీ రాష్ట్రంలో తెలుగు విశ్వవిద్యాలయం లేకుండా పోయింది. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న విశ్వవిద్యాలయం పేరు మార్పుతోపాటు ఏపీలోని విశ్వవిద్యాలయానికి సంబంధించిన మూడు పీఠాల నిర్వహణ అధ్వానం అయింది. బొమ్మూరులోని తెలుగు పీఠంలో గత ఏడాది నుంచి అడ్మిషన్లు ఆగిపోయాయి. జూలై 3వ తేదీన ఎంఏ తెలుగు చివరి బ్యాచ్ పరీక్షలు పూర్తి ఇక ఈ పీఠం ఉనికి ప్రశ్నార్థకమైంది. ఇటువంటి పరిస్థితిలో రాజమండ్రిలో తెలుగువిశ్వవిద్యాలయం ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటన ఈ పీఠానికే కాకుండా రాష్ట్ర ప్రజలకే ఓ తీయని శుభవార్తను అందించినట్టు అయింది. తెలుగు భాషకు, తెలుగు సాహిత్యానికి, తెలుగు కళలకు పూర్వ వైభవం వస్తుందనే అభిప్రాయం మొలకెత్తింది. ఆదికవి నన్నయ్య భారతాన్ని తెలుగులోకి అనువదించిన నేల రాజమహేంద్రవరం. తెలుగు సాంస్కృతిక, సాహిత్య వైభవం విరజిల్లిన ప్రాంతమిది. ఇక్కడ 1986 ఏప్రిల్‌లో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు తెలుగు భాషను ప్రోత్సహించే లక్ష్యంతో హైదరాబాద్‌లో ఉన్న తెలుగువిశ్వవిద్యాలయానికి అనుబంధంగా బొమ్మూరులో పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయ పీఠం ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. అదే సమయంలో రాష్ట్రంలో శ్రీశైలం, కూచిపూడిలలో కూడా తెలుగు విశ్వవిద్యాలయ పీఠాలు ఏర్పాటుచేశారు. తర్వాత బొమ్మూరు తెలుగు పీఠం ఓ వెలుగు వెలిగింది.

● తెలుగుసాహిత్య పీఠం నుంచి...

రాజమండ్రిలోని బొమ్మూరు కొండ మీద సుమారు 45 ఎకరాల భూమిలో తెలుగు సాహిత్య పీఠం ఉండగా, అదిప్పుడు తెలుగు విశ్వవిద్యాలయంగా విరాజిల్లనుంది. 1986లో ఈ పీఠానికి మొత్తం 45 ఎకరాల స్థలాన్ని అధికారికంగా ఇవ్వడంతోపాటు సమీపంలోని మరో 10 ఎకరాల భూమిని కూడా దఖలు పరిచారు. అడ్మినిస్ట్రేషన్ భవనం, దానిలో తరగతుల నిర్వహణ, హాస్టల్, హాస్టల్ మెస్, నాలుగు క్వార్టర్స్ కూడా నిర్మించారు. తొలి పీఠాధిపతిగా కొత్తపల్లి వీరభద్రరావు నియమితులయ్యారు. తర్వాత వరసగా బేతవోలు రామబ్రహ్మం, ఆర్వీఎస్ సుందరం, సి.రమణయ్య, బేతవోలు రామబ్రహ్మం, సి.రమణ్య, పొన్నా లీలావతి, ఎండ్లూరి సుధాకర్, గొల్లకోట సూర్య భాస్కరావు, చివరగా మళ్లీ ఎండ్లూరి సుధాకర్ ఇక్కడ పీఠాధిపతులుగా వ్యవహరించారు. తెలుగు సాహిత్య సభలకు, మరెన్నో గోష్ఠులకు ఈ కేంద్రం విలసిల్లింది. ఇక్కడ తెలుగు ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ తరగతులు నిర్వహించేవారు. మొదట తరగతికి 25 మంది విద్యార్థులతో ఇది మొదలైంది. ఇక్కడ ప్రముఖ ప్రవచనకారుడు గరికిపాటి నరసింహారావు తొలి ఎంఫిల్ బ్యాచ్ పట్టా పొందారు. ప్రముఖకవి అద్దేపల్లి రాంమోహనరావు, విమర్శకుడు ద్వానాశాస్త్రి ఇక్కడ పీహెచ్‌డీ చేశారు. ఇక్కడ 300 మంది పీ హెచ్‌డీలు చేయగా, సుమారు 450 మంది ఎంఫిల్ చేశారు. 550 మంది తెలుగు ఎంఏ చేశారు.

● ప్రస్తుత పరిస్థితి

ఇక్కడ 14 మంది ఉద్యోగులు మాత్రం ఉన్నారు. అందులో కొందరు ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. భవనాలు దాదాపు శిథిలమయ్యాయి. కేవలం 20 ఎకరాల స్థలం మాత్రం మిగిలింది. కానీ ముఖ్యంగా 29 వేల పుస్తకాలతో గ్రంథాలయం మాత్రం నిత్యనూతనంగా ఉండడం విశేషం. ఇక్కడ ఉద్యోగులకు జీతాలు కూడా రాని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో బొమ్మూరు కొండపై ఉన్న భవనాలను ఆధునికీకరించాల్సిన అవసరం ఉంది. విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటుచేసేందుకు ప్రారంభ బడ్జెట్ కింద రూ.20 కోట్లు, జీతభత్యాలు-మౌలిక సదుపాయాల కింద మరో రూ.30 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. హైదరాబాద్ తెలుగువిశ్వవిద్యాలయంలో మొత్తం 22 విభాగాలు, 40 కోర్సులు ఉన్నాయి. వీటన్నింటినీ ఇక్కడ ప్రారంభించాలంటే 72 బోధన పోస్టులు, 115 బోధనేతర పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. అయితే ప్రస్తుతానికి డిమాండు ఉన్న కోర్సులను ప్రారంభించే అవకాశం మాత్రమే ఉంది. ఇది ఇక తెలుగుభాషా సాహిత్యం, సంస్కృతిలో ఉన్నత స్థాయి అధ్యయనం, బోధన, పరిశోధనా కేంద్రంగా పనిచేయనుంది.



జీజీహెచ్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి

ప్రజారోగ్యమే పరమావధిగా వైద్యసేవలు అందించాలి

- అంకాలజీ విభాగంలో సమగ్ర వైద్యసేవలు అందుబాటులోకి
- ఖాళీ పోస్టుల భర్తీకి నవంబరు మొదటివారంలో నోటిఫికేషన్
- జీజీహెచ్‌లో వైద్యాధికారులతో సమీక్షా సమావేశంలో కలెక్టర్ కీర్తి

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వైద్యులు, సిబ్బంది ప్రజల ఆరోగ్యమే పరమావధిగా వైద్యసేవలు అందించాలని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. వైద్యసేవలు అందించే క్రమంలో ప్రతి వైద్యుడు ప్రజల కోసం పనిచేస్తున్నామనే భావనతో విధులు నిర్వర్తించాలని సూచించారు. గురువారం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ బోధనాసుపత్రి (జీజీహెచ్)లో వివిధ విభాగాల హెచ్‌వోడీలు, వైద్యులు, వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్యసేవలు, మౌలిక వసతులు, వైద్య పరికరాల పరిస్థితి, సిబ్బంది కొరత, నిర్మాణ పనుల పురోగతి తదితర అంశాలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రి అధికారులు వైద్యసేవలతోపాటు ఆసుపత్రి పరిశుభ్రత, తాగునీటి సదుపాయం, భద్రతా ఏర్పాట్లపైనా దృష్టి పెట్టాలన్నారు. కేన్సర్ అనుబంధ వైద్య సేవల విభాగంలో అంకాలజీ విభాగం ద్వారా రోగులకు సమగ్ర వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని, ఈ విభాగంలో స్పెషలిస్టు వైద్యులు రోగులకు కేన్సర్ నిర్ధారణ, చికిత్స, కౌన్సెలింగ్, ఫాలోఅప్ సేవలు అందిస్తున్నారన్నారు. జీజీహెచ్‌లో మొత్తం 484 పోస్టులు మంజూరయ్యాయని, వీటిలో 326 పోస్టులు భర్తీకాగా 158 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఖాళీగా ఉన్న పారామెడికల్ సిబ్బంది, టెక్నీషియన్ పోస్టులభర్తీకి నవంబరు తొలివారంలో నోటిఫికేషన్ జారీచేయాలన్నారు. 50 పడకలతో నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ బ్లాకు పనులు 75 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులు ఈనెలాఖరునాటికి పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మార్చురీ విభాగంలో ఫ్రీజర్ల కొరత నివారణకు చర్యలు తీసుకోవాలని, మార్చురీ సమీపంలో టాయిలెట్లు నిర్మించాలని అన్నారు. పీడియాట్రిక్స్ విభాగంలోని ఎస్ఎన్‌సీయూలో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లను నియమించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పల్మనాలజిస్టును జీజీహెచ్‌కు డిప్యూట్ చేయాలని డీఎంఅండ్‌హెచ్‌వోకు సూచించారు. ఈ సమావేశంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.భాస్కరరెడ్డి, వివిధ వైద్య విభాగాల హెచ్‌వోడీలు, వైద్యాధికారులు పాల్గొన్నారు.



ఇది.. యాపారం!

- సోషల్ మీడియాలో అధికార పార్టీ నాయకుడి ఆడియో సంభాషణ
- లిక్కర్ వ్యాపారంపై సిట్టింగ్‌లు

రాజమహేంద్రవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరంలో అధికార పార్టీ నాయకుడు ఒకరు ఫోన్‌లో ఓ షాపు నిర్వాహకుడితో చేసిన సంభాషణ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇది రాజకీయ వర్గాల్లోనూ, లిక్కర్ వ్యాపారుల్లోనూ చర్చనీయాంశమైంది. అధికార పార్టీకి చెందిన ఒక నాయకుడు పార్టీలో కీలక బాధ్యతలు ఇటీవల చేపట్టారు. గత నెల చివరిలో ఒక ప్రముఖ హోటల్‌లో లిక్కర్ వ్యాపారులు, నార్త్, సౌత్ ఎక్సయిజ్ అధికారులతో కలిపి మీటింగ్ నిర్వహించినట్టు ఈ ఆడియో సంభాషణను బట్టి తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఓ వ్యాపారికి సదరు నాయకుడు ఫోన్ చేసి తన పేరు చెప్పి పరిచయం చేసుకున్నాడు. తర్వాత ఫలానా హోటల్‌లో మీటింగ్ ఉందని.. రావాలని ఆహ్వానించారు. ఏంటి మీటింగ్ అని అటువైపు వ్యాపారి ప్రశ్నించగా.. ధరలు పెచ్చుచేసుకోవడం, బెల్ట్‌షాపులు, కేసులేమైనా వస్తే కలిసి భరించడం వంటి అంశాలపై మాట్లాడుకుందామని ఆయన వివరించారు. నార్త్, సౌత్ ఎక్సయిజ్ అధికారులతో ఇప్పటికే మాట్లాడామని, వారు కొన్ని ఆఫర్స్ పెట్టారని, అది కూడా చర్చిస్తామన్నారు. రూ.2 లక్షలు, రూ.2.5 లక్షల కౌంటర్ల ఉన్న షాపులపై ఏదైనా కేసు పెడితే అందరూ కలసి భరించేటట్టు నిర్ణయంతోపాటు అధికారులు కేసులు అడిగితే సిటీలో 28 షాపులకు లాటరీ వేసి, అందులో ఒకటి తీసి, వచ్చిన షాపు పేరిట కేసు ఇచ్చేటట్టు నిర్ణయం తీసుకోనున్నామన్నారు. సిటీ, రూరల్‌లో 39 షాపులు కలసి ఉండాలని సెలవిచ్చారు.



కొవ్వూరు పట్టణంలో గోదావరి స్నానఘట్టాలను బోట్‌పై పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ కీర్తి

బోట్‌లోనే జిల్లా కలెక్టర్ సమీక్ష

కొవ్వూరు గోదావరి ఘాట్ల పరిశీలన.. అధికారులు, స్థానిక నాయకులతో చర్చలు

కొవ్వూరు,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): 2027లో గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తుల భద్రత, పారిశుధ్యంపై అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో గురువారం స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఏపీ టూరిజం బోట్‌లో పర్యటించి స్నానఘట్టాలను పరిశీలించారు. గోష్పాదక్షేత్రం నుంచి కృష్ణ చైతన్య, భక్తాంజనేయ, సుబ్రహ్మణ్యఘాట్, పిండప్రదానం రేవు, క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్, హేవలాక్ వంతెన, శ్రీనివాస స్నానఘట్టం, ఏరినమ్మ ఘాట్‌లను బోట్‌లో నుంచే పరిశీలించారు. బోటులోనే అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి మాట్లాడుతూ రానున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ముఖ్యమంత్రి.. మంత్రుల బృందంతో సమీక్షా సమావేశాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. జిల్లా స్థాయిలో అన్నిశాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు సన్నాహాలు వేగవంతం చేసే విధానంలో ప్రధాన ఘాట్లను పరిశీలించినట్టు చెప్పారు. త్వరలో రాష్ట్రస్థాయి పర్యవేక్షక బృందం జిల్లాలో పర్యటించే అవకాశం ఉందన్నారు.

పర్యాటక ప్రాజెక్టుపై సమీక్ష

కొవ్వూరులో గోదావరి ఒడ్డున నిర్మాణంలో ఉన్న పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టు వివరాలు అడిగి తెలుసుకున్నారు. 26 కాటేజ్‌లు, బార్, రెస్టారెంటు, స్విమ్మింగ్ పూల్, కాన్ఫరెన్స్ హాలు వంటి సౌకర్యాలతో 60 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. మిగిలిన పనులు త్వరితగతిన ప్రారంభించి పుష్కరాలకు ముందే పూర్తి చేయాలన్నారు. ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, ఇరిగేషన్ ఈఈ జి.శ్రీనివాస్, జిల్లా టూరిజం అధికారి పి.వెంకటాచలం, ఆర్డీవో రాణి సుస్మిత, సూరపనేని చిన్ని, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, బర్ల శ్రీనివాసరావు, శ్రీవత్సవ కన్సల్‌టెంట్ బి.కిరణ్, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలోని సాంఘిక సంక్షేమశాఖ నెం.1 కాలేజీ బాలుర హాస్టల్

హాస్టల్ 'పంచాయితీ'

- పోలీసులకు ఫిర్యాదు చేసిన లేడీవార్డెన్, లేడీవార్డెన్‌పై ఇటీవలే హాస్టల్ నుంచి బయటకెళ్లిన విద్యార్థి ఫిర్యాదు
- డీఎస్‌డబ్ల్యువో సమక్షంలో ఇరువర్గాల చర్చలు.. పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాల ఫిర్యాదుల ఉపసంహరణ

రాజమహేంద్రవరంఅర్బన్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని సాంఘిక సంక్షేమశాఖ కాలేజీ బాలుర హాస్టల్ నెం.1లో ఆందోళనకర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇక్కడ ఇన్‌చార్జిగా ఉన్న లేడీవార్డెన్‌కు, హాస్టల్‌లోని కొందరు విద్యార్థులకు మధ్య కొంత కాలంగా కోల్డ్‌వార్ జరుగుతోంది. అదికాస్తా తారస్థాయికి చేరుకుని ఇటీవల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుల వరకూ వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. సెమిస్టర్ ఒకటి పూర్తికాకుండానే హాస్టల్‌లో చదువు ముగించి ఇటీవలే బయటకు వెళ్లిన ఒక విద్యార్థిపై లేడీవార్డెన్ పోలీసులకు ఫిర్యాదు చేయడం, దీనికి ప్రతిగా సదరు విద్యార్థి కూడా కౌంటర్ ఫిర్యాదు చేయడం, మర్నాడు లేడీ వార్డెన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి మరో ఫిర్యాదు ఇవ్వడం సమస్య తీవ్రతకు అద్దంపడుతోంది. అలాగే ఇటీవల దసరా సెలవుల సమయంలో అందరూ బయటకు వెళ్లిపోవాలని, హాస్టల్‌లో ఒక్కరు కూడా ఉండకూడదని చెబుతూ లేడీ వార్డెన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు విద్యార్థులను ఆందోళనకు గురిచేసింది. విద్యార్థులపై పోలీసులకు ఫిర్యాదులు, మెనూ సక్రమంగా పెట్టకపోవడం, ఇక్కడ ఇన్‌చార్జిగా ఉన్న లేడీ వార్డెన్ గతంలో రాజమహేంద్రవరంలో పనిచేసిన ఒక హాస్టల్‌కు సంబంధించి విద్యార్థుల మాన్యువల్ హాజరుపై ఆర్‌టీఐలో సమాచారం కోరడం వంటి పలు అంశాలు ఈ పరిణామాలు, పరిస్థితులకు ప్రధానకారణంగా తెలిసింది. వీటితోపాటు 'దసరా సెలవులు-హాస్టల్ బియ్యం' ఆరోపణలపై హాస్టల్‌లో పనిచేస్తున్న ఉద్యోగి ఒకరిని కొందరు విద్యార్థులు నిలదీసిన తీసిన అంశం వీటన్నింటికీ ప్రధాన మూలకారణంగా ప్రచారం జరుగుతోంది. ఆ ఉద్యోగిని విజిలెన్స్ అధికారులు ప్రశ్నిస్తే వాస్తవాలు బయటకు వస్తాయని, చిక్కుముడి వీడిపోతుందని కూడా చెప్పుకుంటున్నారు. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోని నెం.1 బాలుర కాలేజీ హాస్టల్‌లో ఇంత జరుగుతున్నా జిల్లా సాంఘిక సంక్షేమ అధికారులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోకపోవడం, సమస్యను గుర్తించి పరిష్కరించేందుకు ప్రయత్నించకపోవడం ఇప్పుడు జిల్లా సాంఘిక సంక్షేమశాఖలో అంతర్గతంగా తీవ్ర దుమారం రేపుతోంది.

● డీఎస్‌డబ్ల్యువో కార్యాలయంలో..

కాగా, హాస్టల్ లేడీ వార్డెన్‌కు, విద్యార్థులకు మధ్య కోల్డ్‌వార్ నేపథ్యంలో ఇరువర్గాలు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకోవంతో డీఎస్‌డబ్ల్యువో సోమవారం రాత్రి తన కార్యాలయంలో ఇరువర్గాలతోనూ 'పంచాయితీ' నిర్వహించినట్టు సమాచారం. రెండు వర్గాలతో చర్చలు జరిపి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని, లేకుంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఈ సందర్భంగా అధికారులు, నేతలు విద్యార్థులపై ఒత్తిడి తెచ్చినట్టు తెలిసింది. హాస్టల్‌లో జరుగుతున్న అక్రమాలు, ఇతర పరిణామాలు, తాము పడుతున్న ఇబ్బందులు చెప్పుకునే అవకాశం కూడా ఇవ్వరా అని కొందరు విద్యార్థులు నిలదీసినట్టు సమాచారం. చివరకు అదేరోజు రాత్రి ఇరువర్గాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు ఉపసంహరించుకున్నారని తెలిసింది. ఇదిలా ఉంటే కాలేజీ హాస్టల్ కావడంతో యుక్త వయస్సులోని వాళ్లే ఉంటారు. లేడీ వార్డెన్‌ను ఇన్‌చార్జిగా నియమించడం ఇక్కడి విద్యార్థుల్లో అసంతృప్తికి ఒక కారణంగా చెబుతున్నారు. లేడీ వార్డెన్ కావడం వల్ల తాము హాస్టల్‌లో ఏ సమస్య చెప్పుకోవాలన్నా, వ్యక్తిగత ఇబ్బందులు తెలియజేయాలన్నా ఇబ్బందికరంగా ఉంటున్నదని వీరు చెబుతున్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జిగా ఉన్న లేడీ వార్డెన్ కోరుకొండలో ఎస్సీ హాస్టల్‌కు రెగ్యులర్ వార్డెన్‌గా ఉన్నారు. అక్కడి వార్డెన్‌ను తీసుకొచ్చి ఇక్కడ ఇన్‌చార్జిగా వేయడం ఏమిటనే ప్రశ్నా తలెత్తుతోంది. నెం.1 కాలేజీ బాలుర హాస్టల్‌లో ప్రస్తుతం 160 మంది వరకూ విద్యార్థులు ఉంటున్నారు. వివిధ కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ, పీజీ కోర్సులు చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే ఈ హాస్టల్‌పై దృష్టిసారించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రాహుల్‌మీనా

పుష్కరాల నాటికి రాజమహేంద్రవరాన్ని అన్ని సదుపాయాలతో సిద్ధం చేయాలి

గోదావరి పుష్కర పనులపై కమిషనర్ రాహుల్‌మీనా సమీక్ష

రాజమహేంద్రవరంసిటీ, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలు -2027ని దృష్టిలో పెట్టుకుని రాజమహేంద్రవరాన్ని అన్ని మౌలిక సదుపాయాలతో సిద్ధంచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్‌మీనా ఆదేశించారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం గోదావరి పుష్కర పనులపై సమీక్షలో కమిషనర్ మాట్లాడారు. గోదావరి పుష్కరాలకు 21 నెలల వ్యవధి ఉందన్నారు. అందువల్ల వేగంగా నగరపాలక సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. శాశ్వత మౌలిక వసతులపై దృష్టిపెట్టాలన్నారు. లక్షల్లో భక్తులు రాజమహేంద్రవరానికి వస్తారని, ఎక్కడా ఇబ్బంది లేకుండా రహదారుల నిర్మాణం, వాహనాల పార్కింగ్, తాగునీరు, స్నానాల ఘాట్లు వంటి అన్ని వసతులు ఉండేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. పుష్కరాల్లో రద్దీని నియంత్రణ కోసం ప్రతీ ఘాట్ వద్ద ఏఐ టెక్నాలజీ స్మార్ట్ పోల్స్ ఏర్పాటుచేయాలని సూచించారు. దీని ద్వారా ఏఐ సహాయంతో భక్తుల రద్దీని ముందుగానే పసిగట్టి ప్రమాదాలు నివారించవచ్చన్నారు. కుంభమేళాలో ఈ విధానం విజయవంతమైందన్నారు. భక్తులకు సరిపడా వసతి సౌకర్యాలు కల్పించాలని, అందుకోసం నగరంలో కల్యాణ మండపాలు, పాఠశాలలు, హోటళ్లు, గెస్ట్‌హౌస్‌లను చూడాలన్నారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ శైలజవల్లి, ఎస్ఈ ఇంచార్జి రీటా, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లజర్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రకాశరావు పాలెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆర్‌డీఎస్ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈఈ నారాయణ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే శనివారం నల్లజర్లలో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

జీఎస్టీ 2.0పై ఆటోడ్రైవర్ల అవగాహన ర్యాలీ


కొవ్వూరు పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటోడ్రైవర్లు, నాయకులు


నిడదవోలులో ఆటోడ్రైవర్లతో కలిసి జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం


గోపాలపురం ర్యాలీలో పాల్గొన్న కూటమి నాయకులు, ఆటోడ్రైవర్లు

కొవ్వూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దేశంలో జీఎస్టీ 2.0ను ప్రధాని మోదీ అమలు చేస్తూ అద్భుతమైన సంస్కరణలు చేశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. గురువారం సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా రవాణాశాఖ ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లు పట్టణ పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక మెరకవీధి వాటర్ ట్యాంకు సెంటర్‌లో ర్యాలీని నాగేంద్ర జెండా ఊపి ప్రారంభించారు. నాగేంద్ర మాట్లాడుతూ రవాణా వాహనాలపై 28 శాతంగా ఉన్న జీఎస్టీని 18 శాతానికి తగ్గించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ సూరపనేని చిన్ని, బోడపాటి ముత్యాలరావు, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, జనసేన పట్టణ అధ్యక్షులు డేగల రామ్‌కుమార్, కె.రత్నసాయి, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వీఎల్ ప్రవీణ, జీఎస్టీ అధికారులు ఎస్.శ్రీనివాసరావు, కె.సుబ్రహ్మణ్యం, కేవీ సుబ్బారావు, ఆటో యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: రాష్ట్రప్రభుత్వం సూపర్ బెనిఫిట్స్ జీఎస్టీని అం దించిందని మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారా యణ అన్నారు. గురువారం పట్టణంలోని గణేష్ చౌక్ సెంటరులో రవాణా, లాజిస్టిక్స్ రంగానికి సూపర్ గిఫ్ట్‌పై అవగాహన సదస్సు నిర్వహిం చారు. కొవ్వూరు ఎంవీఐ కె.చైతన్య సుమ పాల్గొని మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ ద్వారా వాహ నాల కొనుగోలు , సులభతరమైన పన్ను ద్వారా రవాణా రంగానికి ఎంతో మేలు జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

గోపాలపురం: వినియోగదారులపై భారం తగ్గించేందుకే కూటమి ప్రభుత్వం జీఎస్టీ 2.0ను అమల్లోకి తెచ్చిందని రవాణాధికారి వెంకట రమణ అన్నారు. గోపాలపురంలో గురువారం సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కూడలి వెంబడి ర్యాలీ నిర్వహించి జీఎస్టీ 2.0 వల్ల వినియోగదారులకు కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు కొర్లపాటి రాము, సమన్వయ కమిటీ సభ్యులు వేముల నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు గేద్ద హరిబాబు, రైతు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా కార్యదర్శి గెల్లా శ్రీనుబాబు, మండల తెలుగు యువత అధ్యక్షుడు పసుమర్తి రాఘవ, అనిశెట్టి త్రిమూర్తులు, ఆటోడ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

గోదావరి హారతికి పకడ్బందీ ఏర్పాట్లు : ఆర్డీవో


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో రాణీసుస్మిత

కొవ్వూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గోష్పాదక్షేత్రంలో ఈనెల 27వ తేదీన జరగనున్న గోదావరి హారతికి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆర్డీవో రాణీసుస్మిత తెలిపారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో గురువారం గోదావరి హారతికి సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ సూరపనేని చిన్ని, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, దాససాహిత్య ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎన్‌వీ శివరామకృష్ణ, కలగర శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామకృష్ణ, ట్రైనీ ఎస్ఐ ఆదిత్య శ్రీనివాస్

తాళ్లపూడి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కేవలం చదువుపై దృష్టి పెట్టాలని, ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌లను ఉపయోగించుకోవాలని ఎస్ఐ టీ. రామకృష్ణ, ట్రైనీ ఎస్ఐ ఆదిత్య శ్రీనివాస్ తెలిపారు. వేగేశ్వరపురం కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం సాయంత్రం పరస్పరం తోపులాటకు దిగిన సంఘటన నేపథ్యంలో గురువారం ఎస్ఐ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు చదువుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సురక్ష యాప్‌తో నకిలీ మద్యాన్ని గుర్తించవచ్చు

కొవ్వూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎక్సైజ్ డిపార్టుమెంట్ తెచ్చిన సురక్ష యాప్‌తో నకిలీ మద్యాన్ని గుర్తించవచ్చునని ఎక్సైజ్ సీఐ జీ.సత్యనారాయణ తెలిపారు. ప్రస్తుత కాలంలో నకిలీ కల్తీ మద్యం లభ్యమవుతున్న నేపథ్యంలో మందుబాబులు, ప్రజల సౌకర్యార్థం ఎక్సైజ్ శాఖ ఈ యాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఇందులో మద్యం సీసాపై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసినట్టయితే ఆ మద్యం బాటిల్ ప్రభుత్వ అనుమతితో విక్రయించబడిందా లేదా నకిలీదా అని గుర్తించవచ్చన్నారు.

ఆర్టీసీ డిపోలో విస్తృత తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయ్‌రత్నం

నిడదవోలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ డిపోను గురువారం ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జీ.విజయ్‌రత్నం, ఇంజనీరింగ్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ట్రాఫిక్, ఎర్నింగ్ సెక్షన్, డిపో మేనేజర్ కార్యాలయాన్ని సందర్శించారు.

దాడిచేసిన ఘటనలో కేసు నమోదు

కొవ్వూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దొంగతనానికి ఇంట్లో చొరబడి అడ్డువచ్చిన ముగ్గురిపై దాడిచేసిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ట్రైనీ ఎస్ఐ బెల్లంకొండ జయరాజు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం పంగిడికి చెందిన జంపా రాకేష్ వరప్రసాద్ ఇంట్లోకి దొంగతనానికై ఈనెల 14వ తేదీ రాత్రి నాగూర్, ఖాజా ప్రవేశించారు. దీంతో దొంగతనం జరగకుండా అడ్డుపడిన జంపా రాకేష్ వరప్రసాద్‌తో పాటు వారి బాబాయిలు జంపా ఆంజనేయులు, జంపా రామదాసులను చాకుతో గాయపరిచ్చి చంపేప్రయత్నం చేసి, వారి వద్ద ఉన్న రూ. 5 వేలు దౌర్జన్యంగా లాక్కొని పారిపోయారు. వరప్రసాద్ అందించిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్టు ట్రైనీ ఎస్ఐ తెలిపారు.

పశువుల షెడ్లను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఎంపీపీ కేవీకే దుర్గారావు

దేవరపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పశువుల షెడ్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా పశువుల షెడ్ల నిర్మాణ లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ రైతులంతా గోకులం షెడ్లు నిర్మించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ నాగార్జునరావు, ఏపీవో శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

పలు ఆలయాల హుండీలు లెక్కింపు


తిమ్మరాజుపాలెంలో హుండీని లెక్కిస్తున్న దృశ్యం

నిడదవోలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : తిమ్మరాజుపాలెంలో వేంచేసి వున్న కోటసత్తెమ్మ వారి దేవస్థానంలో గురువారం దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో హుండీలను లెక్కించారు. సుమారు 103 రోజులకుగాను హుండీల ద్వారా రూ. 34,61,125, అన్నదాన హుండీ ద్వారా రూ.1,50,716... మొత్తం రూ. 36,11,886 ఆదాయం లభించినట్టు దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. వీటితో పాటుగా బంగారం 16 గ్రాముల 500 మిల్లీ గ్రాములు, వెండి 245 గ్రాములు, విదేశీ కరెన్సీ యుఎస్ఇ 5 దీరమ్స్ నోట్ 1, సింగపూర్ 10 డాలర్స్ నోట్ 1, యెఎస్ఏ 20 డాలర్స్ నోట్ 1, 1 డాలర్ నోట్స్ 2 లభించాయి. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షణాధికారి ఈవీ సుబ్బారావు , ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

గుబ్బాలమ్మ ఆలయంలో..

గోపవరంలో వేంచేసి వున్న గుబ్బాలమ్మ వారి ఆలయ హుండీని గురువారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో లెక్కించారు. సుమారు మూడు నెలల రెండు రోజులకు రూ. 1,53,527 ఆదాయం లభించిందని ఆలయ ఈవో నామా సూర్యప్రకాశరావు తెలిపారు.


గోపవరంలో ఆలయ హుండీని లెక్కిస్తున్న దృశ్యం


అన్నవరప్పాడు ఆలయంలో హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న దృశ్యం

పెరవలి: అన్నవరప్పాడులో వేంచేసియున్న వెంకటేశ్వరస్వామి ఆలయం హుండీని గురువారం లెక్కించారు. దేవాదాయ శాఖ తనిఖీ దారి సత్యవర ప్రసాద్ పర్యవేక్షణలో 50 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ. 4 లక్షల 9 వేల 326 , అన్నదాన హుండీ ద్వారా 8 వేల 831 రూపాయలు.. మొత్తం 4 లక్షల 18 వేల 157 రూపాయల ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో ఎం. రాధాకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులతోపాటు భక్తులు, దాతలు, ఆలయ అర్చకులు , సిబ్బంది పాల్గొన్నారు.

నిడదవోలు ఏఎంసీ వైస్ ఛైర్మన్‌గా రతీదేవి


రతీదేవిని సత్కరిస్తున్న ఛైర్మన్, కౌన్సిలర్లు, అధికారులు

నిడదవోలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు అగ్రికల్చరల్ మార్కెటింగ్ కమిటీ వైస్ ఛైర్మన్‌గా కౌన్సిలర్ పువ్వల రతీదేవిని ప్రభుత్వం నియమించడం అభినందనీయమని మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోనఇ కౌన్సిల్ హాలులో రతీదేవిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో 20 సంవత్సరాల పాటు మున్సిపల్ కౌన్సిలర్‌గా విశేష సేవలం దిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తోటకృష్ణవేణి, శింగవరం సొసైటి అధ్యక్షులు పెన్మెత్స చందు, వైస్ ఛైర్మన్ వజీరు ద్దీన్, మున్సిపల్ కౌన్సిలరులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ డైరెక్టర్లుగా ముగ్గురికి చోటు

పెరవలి: నిడదవోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా మండలం నుంచి ముగ్గురికి చోటు లభించింది. కాపవరానికి చెందిన కారుమూరి శేషుబాబు, అజ్జరానికి చెందిన వాతాబత్తుల శ్రీనివాస్, కాకరపర్రుకు చెందిన సంగీత పార్వతి నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మంత్రి దుర్గేష్ , మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి ఈ పదవులు రావడంపై అతికాల రామకృష్ణమ్మ, జనసేన నేత పిప్పర రవి, తదితర కూటమి నాయకులు అభినందనలు తెలిపారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థికసాయం అందజేత


దూబచర్లలో సాయం అందిస్తున్న సువర్ణరాజు, నాయకులు

నల్లజర్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దూబచర్లలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు కాలిపోయిన బాధిత కుటుంబానికి జనసేన పార్టీ గురువారం ఆర్థిక సాయం అందించింది. కంచెర్ల నాగేశ్వరరావు కుటుంబాన్ని జనసేన నాయకులు పరామర్శించి రూ.18 వేలు నగదు, నిత్యవసర వస్తువులను నియోజక వర్గ కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు, మండలాధ్యక్షుడు చోడసాని బాపిరాజు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో శ్రీశివకాల సురేష్, పురేళ్ల సత్యనారాయణ, మండల కార్యదర్శి కొత్తపల్లి హరిబాబు, గుండా బత్తుల వరుణ్, రాసమల్ల నాగరాజు, ఉన్నమట్ల సత్య, లక్కోజు లక్ష్మణ్, బసవరెడ్డి పవన్, రేవంత్ సాయి, ఆకురాతి సాయి కుమార్ పాల్గొన్నారు.

బాణసంచా అమ్మకాలకు అనుమతులు తప్పనిసరి

• ఉండ్రాజవరం తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్


ఉండ్రాజవరంలో బాణసంచా విక్రయ ప్రదేశాలను పరిశీలిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బాణసంచా విక్రయదారులు అనుమతులు తప్పనిసరిగా పొందాలని తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ చెప్పారు. గురువారం మండల కేంద్రమైన ఉండ్రాజవరంలో దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసే బాణసంచా దుకాణాల ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా షాపుల యజమానులతో మాట్లాడుతూ అన్ని అనుమతులతోపాటు విక్రయ సమయంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం షాపులు ఏర్పాటు చేయకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ డి. రవికుమార్, ఎలక్ట్రికల్ ఏఈ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం : సీఐ నాయక్

దేవరపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీఐ బీఎన్ నాయక్ పేర్కొన్నారు. గురువారం గౌరీపట్నం అరుంధతి కాలనీలో గ్రామస్థులకు చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో కొత్తగా ఎవరైనా సంచరిస్తే ప్రజలు అప్రమత్తమై పోలీసులకు తెలియజేయాలన్నారు. అలాగే పేకాట, జూదం, కోడిపందేలు, సారా బట్టీలు నిర్వహించినా వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు పండ్లు పంపిణీ


దివ్యాంగ సంస్థకు రూ.లక్ష నగదు అందజేస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పాలంగిలో స్పందన ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసిక దివ్యాంగుల పాఠశాల విద్యార్థులకు పెరవలి మండలం తీపర్రుకి చెందిన కుందుల గణపతి రావు, వాణి దంపతుల కుమారుడు కుందుల బ్రహ్మయ్యచౌదరి, లక్ష్మీమేఘన దంపతుల మొదటి వివాహం రోజు సందర్భంగా గురువారం పిల్లలకు పండ్లు, స్వీట్స్ భోజనం అందజేశారు. అలాగే అమెరికాలో ఉంటున్న బ్రహ్మయ్యచౌదరి, లక్ష్మీమేఘన మానసిక దివ్యాంగ విద్యార్థులకు లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని వారి తరఫున గణపతిరావు, వాణి దంపతులు నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు కే. జితేంద్రకుమార్, కుందుల గణపతిరావు, వాణి దంపతుల తోపాటు బంధువులు పాల్గొన్నారు.

'బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్‌తో మేలు'


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న శేషారావు

ఉండ్రాజవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఎంతో మేలు జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. గురువారం వేలివెన్నులో నియోజకవర్గంలోని పెరవలి, ఉండ్రాజవరం, నిడదవోలు పట్టణం, నిడదవోలు రూరల్ మండలాలకు చెందిన 48 మందికి మంజూరైన రూ. 34.91లక్షల విలువైన చెక్కులను శేషారావు పంపిణీ చేశారు. అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆటో.. ఒకరికి గాయాలు

కొవ్వూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని ఢీకొని ఆటోడ్రైవర్ గాయపడిన సంఘటన కుమారదేవంలో గురువారం జరిగింది. పోలీసులు అందించిన వివరాలివి.. రాజమహేంద్రవరం తాడితోటకు చెందిన చిట్టి వెంకటేశ్వర్లు ఈనెల 11వ తేదీన తాళ్లపూడి కిరాయికి వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్తుండగా కొవ్వూరు మండలం కుమారదేవం ఇసుక ర్యాంపు వద్ద ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా రోడ్డుపై లారీ నిలుపుదల చేశాడు. ఎదురుగా వాహనం రావడంతో ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వరరావుకు బలమైన రక్తగాయాలు అయ్యాయి. వెంకటేశ్వరరావు కుమారుడు చిట్టి ఫణీంద్ర అందించిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరురూరల్ ట్రైనీ ఎస్ఐ బెల్లంకొండ జయరాజు తెలిపారు.

అదుపుతప్పిన బొలెరో వ్యాన్

• డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు


గాయాలపాలైన వ్యక్తిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది

గోపాలపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అరటిగెలల లోడుతో వెళ్తున్న బొలెరో వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడిన సంఘటన జగన్నాథపురం గ్రామశివారులో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలంలోని బోడిగూడెం పంచాయతీ శివారు గ్రామమైన బర్కేట్‌నగర్‌లో అరటి గెలలు లోడు చేసుకున్న వ్యాన్ జగన్నాథపురం వద్ద జాతీయ రహదారి పై నుంచి వస్తుండగా అదుపుతప్పింది. దీంతో వ్యాన్ డ్రైవర్ గణేశ్, క్లీనర్ సాయికి గాయాలు కావడంతో 108 వాహనం సాయంతో గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.


చీరమేను... సందడి



• యానాం మార్కెట్‌లో శేరు రూ.1,500కు లభ్యం
• చౌక ధర అంటూ భారీగా తరలివచ్చిన కొనుగోలుదారులు
• మత్స్యకారులకు కాసుల వర్షం

యానాం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అంతర్భాగంగా ఉన్న కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలో చీరమేను సందడి చేసింది. యానాం, గోదావరి జిల్లా వాసులు, మాంసాహారప్రియులు ఎంతో ఇష్టంగా తినే చేరమేను దీపావళి ముందు ఎక్కువగా దొరుకుతుంది. తూర్పు గాలుల సమయంలో నీటి అడుగు భాగం నుంచి ఉపరితలంపైకి చేరుకుంటాయి. యానాంలో గురువారం అధిక సంఖ్యలో చీరమేను దొరికి మత్స్యకారులకు కాసుల వర్షం కురిపించింది. ఉదయం నుంచి పెద్ద మొత్తంలో చీరమేను మార్కెట్‌కు రావడంతో రాజీవ్‌గాంధీ బీచ్‌లోని పుష్కర ఘాట్ వద్ద సందడి వాతావరణం నెలకొంది. బకెట్, బిందెల్లో (ఒక్కో బకెట్ సుమారు 10 లీటర్లు) చీరమేను లభ్యమైనట్టు తెలిసింది. రెండు రోజుల క్రితం శేరు (ఒక లీటరు) రూ.2వేలకు పైగా అమ్ముడైంది. ప్రస్తుతం శేరు రూ.1,500 నుంచి రూ.1,600 వరకు అమ్ముతున్నారు. చీరమేను చౌకగా దొరుకుతోందని తెలియడంతో మాంసాహారప్రియులు భారీగా వచ్చారు. కొందరు సేర్లు, మరికొందరు బకెట్‌లతో కొనుగోలు చేశారు. దీపావళి ముందు రోజుల్లో చీరమేను పడటం సహజం. అయితే గోదావరిలో తెల్ల నీరు (మురి కిగా కాకుండా) తేలిపోవడంతో చీరమేను అధిక సంఖ్యలో లభ్యమవుతోందని స్థానిక మత్స్యకారులు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

పోలవరం నిర్వాసితులకు రూ.1,100 కోట్ల పరిహారం


నిర్మాణంలో ఉన్న పోలవరం ప్రాజెక్టు

దేవీపట్నం/కుక్కునూరు/వేలేరుపాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు 41.15 కాంటూరు లెవెల్‌లో ఉన్న నిర్వాసితులకు పునరావాస, కోల్పోతున్న ఇళ్లకు పరిహారం ప్యాకేజీని వారి ఖాతాల్లో జమచేయడానికి ప్రభుత్వం రూ.1,100 కోట్లు విడుదల చేసింది. దీనిపై దేవీపట్నం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని నిర్వాసితుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈఏడాది జనవరిలో దేవీపట్నం మండలంలోని పలుగ్రామాల నిర్వాసితులకు, కుక్కునూరు ఏ-బ్లాక్, గొమ్ముగూడెం, సీతారామపురం, కివ్వాక, చీరవల్లి, దామరచర్ల, భువనగిరి, గుంపెనపల్లిలోని నిర్వాసితులకు, వేలేరుపాడు మండలాల నిర్వాసితులకు రూ.1,000 కోట్ల వరకు వారి ఖాతాల్లో జమచేశారు. నిర్వాసితులకు వ్యక్తిగత పునరావాస, కోల్పోతున్న ఇళ్లకు పరిహారం, పునరావాస కాలనీల్లో ఇళ్ల, స్థలం వద్దనుకున్న వారికి పరిహారం చెల్లించారు. తాజాగా దేవీపట్నం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 25 గ్రామాల్లోని నిర్వాసితుల ఖాతాల్లో జమ కావడం ప్రారంభమైంది. 41.15 కాంటూరు పరిధిలో రూ.2,500 కోట్లు నిర్వాసితులకు చెల్లించాల్సి ఉండగా, జనవరిలో కొంత మేర నిధులు విడుదల చేయడంతో వేలేరుపాడు మండలంలో అక్కడక్కడ సొమ్ములు జమయ్యాయి. గతంలో పెండింగులో వున్న బిల్లులతోపాటు కొత్తగా పెట్టబోయే బిల్లులను ప్రభుత్వానికి పంపిస్తే ఆ మేరకు నిర్వాసితుల ఖాతాల్లో పరిహారం జమయ్యే అవకాశాలున్నాయి.

గోదావరి జిల్లాల గొప్పతనాన్ని చెప్పేందుకే... ఆహార పదార్థాల ప్రదర్శన

• నన్నయ వీసీ ప్రసన్నశ్రీ
• ముగిసిన ఆహార మహోత్సవ్



విజేతలకు బహుమతులను అందజేస్తున్న వీసీ ప్రసన్నశ్రీ, రిజిస్ట్రార్ స్వామి

దివాన్‌చెరువు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సైన్స్, టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా మూడురోజులపాటు జరిగిన ఆహార మహోత్సవ్ కార్యక్రమం గురవారంతో ముగిసింది. మూడోరోజైన గురువారం విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో పశ్చిమగోదావరిజిల్లా ఫుడ్‌స్టాల్ ప్రదర్శన జరిగింది. నన్నయ అనుబంధ కళాశాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు హాజరై 84 స్టాల్స్‌లో తమ ఆహారపదార్థాలను ప్రదర్శించారు. పండుగ వాతావరణంలో జరిగిన ఈకార్యక్రమాన్ని విద్యార్థినీ, విద్యార్థులు, అధ్యాపకులు ఆశక్తిగా తిలకించారు. ఈసందర్భంగా వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ ఆరోగ్యకరకరమైన అలవాట్లను, వంటకాలను ఆరోగ్యకరమైన జీవితాన్ని గోదావరిజిల్లా గొప్పతనాన్ని తెలియజేసే ప్రయత్నమే ఈకార్యక్రమం లక్ష్యం అని అన్నారు. తమ లక్ష్యం నెరవేరిందని చెప్పారు. అనంతరం శాఖాహార, మాంసాహార విభాగాలలో విజేతలైన వారికి వీసీ ప్రసన్నశ్రీ, విశ్వవిద్యాలయ అధికారులు, న్యాయనిర్ణేతలు బహుమతులను అందజేశారు. రెండురోజుల ఆహార మహోత్సవ్‌లోస్టాల్స్‌ను ఏర్పాటుచేసిన వారికి ప్రసంశాపత్రాలు అందజేశారు. రిజిస్ట్రార్ ఆచార్య కె.వి.స్వామి, ప్రిన్సిపాల్‌లు పి.విజయనిర్మల, పి.వెంకటేశ్వరరావు, విభాగాధిపతి డి.కళ్యాణి, అధ్యాపకులు టి.హైమావతి, బి.ఉషశ్రీ, శాంతరాజ్యం, ఎం.ఎం.కృష్ణవేణి,టి.సింధూజ పాల్గొన్నారు.

విజేతలు వీరే ..

● శాఖాహార వంటకాలలో మొదటి స్థానం సున్నుండలు, కారప్పూస చేసిన హయగ్రీవ బీఈ డీ కళాశాల చింతలపూడి డి.కీర్తి, చల్లా స్వర్ణలత, రెండోస్థానం కొబ్బరిపాలతో వంకాయపచ్చడి చేసిన విశ్వవిద్యాలయం మెకానికల్ విద్యార్థి జి.ఆదర్శ్, మూడోస్థానం గోంగూర బిర్యానీ, సొరకాయ హల్వా, లచ్చించారు, ఉలవచారు చేసిన బి.వి.రాజు కళాశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ప్రో త్సాహక బహుమతులను ఎస్.కె.సుల్తానా, కె.అమృత, డాక్టర్ ఉమామణి, ఎం.హర్షిత నాగశ్రీ, దేవలాల్ అందుకున్నారు.

●మాంసాహార వంటకాలలో మొదటిస్థానం ఎండు చేపకూర చేసిన విశ్వవిద్యాలయం బాలికల వసతిగృహం విద్యార్థులు, రెండోస్థానం చికెన్ ఫ్రైడ్‌రైస్ చేసిన నన్నయ వర్సిటీ కుమారి, మూడో స్థానం కుండలో కోడికూర, చద్దెన్నంకు ఫిజిక్స్ విభాగం నుంచి క్రాంతి అందుకున్నారు. ప్రోత్సాహక బహుమతులు వర్సిటీ ఎస్టాబ్లిష్మెంట్ విభాగం నుంచి జి.చంద్రకళ, తాడేపల్లిగూడెం ప్రాంగణం నుంచి ఎస్.ఉషారామ్, బీఈడీ విద్యార్థి జి.రమ్య, ఎంబీఏ విద్యార్థి వి.సాహితీ అందుకున్నారు.